గెడా రంగారావు

అడవిలో అగచాట్లు!

ఏ. వీ. మోహన్రావ్

"ఇదీ నా ప్లాన్! అంతా సవ్యంగా జరిగితే మన ముగ్గురికీ తలో రెండు లక్షలు కాష్ చిక్కుతుంది" అన్నాడు సుందర్ సిగరెట్ బట్ ఆష్ ట్రేలో నొక్కుతూ.

ఆనంద్ స్టూలు పైనుండి కాళ్ళు క్రిందికిదించి నిట్టూర్చాడు. మోహన్ మౌనంగా కిటికీ కేసి చూశాడు.

"మీ రిద్దరూ ఏదో ఆలోచిస్తున్నట్టున్నారు?" అర్థం గాక అడిగాడు సుందర్.

"ఏం లేదు! పెట్టుబడికి పాతిక వేలన్నా కావాల్సి వుంటుంది. నా దగ్గర అంత లేదు. మొత్తం కలిపితే ఏడు వేలుంటుందేమో?" అన్నాడు ఆనంద్.

"నా దగ్గరో ఐదు వేలుంది. అయినా మనవు మరో

పదమూడు వేలన్నా కావాలి!" చెప్పాడు మోహన్.

"మీ రిద్దరూ పేరుమోసిన పిక్ పాకెట్స్ గాళ్ళు కదా? అలా రద్దీగావుండే మౌంట్ రోడ్ కు పోయి పది పర్సులు కొట్టుకొస్తే చాలు. మన పని జరిగిపోతుంది. ఆ తర్వాత చిల్లర దొంగతనాలు, చిన్న పిక్ పాకెట్ లు చెయ్యాల్సిన అవసరం వుండదు!" అన్నాడు సుందర్.

"నీ దగ్గరేం డబ్బులేదా?" ఆనంద్ అడిగాడు.

"లేదు! కాబట్టే మిమ్మల్ను వెతుక్కుంటూ వచ్చాను. నా ప్లాను నచ్చకున్నా, లేదా డబ్బు తేలేమన్న అనుమానమున్నా మీరు నాతో చేరనవసరంలేదు. మరొకరెవరినన్నా చూసుకోగలను" అన్నాడు సుందర్.

"అందుక్కాదు! ముగ్గురం సమాన లాభాలు పొందబోయేటప్పుడు, పెట్టుబడికూడా సమాన వాటాల్లోవుంటే బాగుంటుందని......" అంటూ మధ్యలోనే ఆపాడు మోహన్.

"కానీ ప్లాన్ నాది. డబ్బు మీది. నా ప్లాన్ కు వాటా రావాలి. అంతే!" అన్నాడు సుందర్.

హోటల్ బాయ్ వచ్చి తలుపు తట్టాడు.

సుందర్ వెళ్ళి తలుపు తీశాడు.

ట్రేలో మూడు కప్పుల కాఫీ తెచ్చి టీపాయ్ పైన పెట్టి వెనక్కి వెళ్ళిపోయాడు. ముగ్గురూ మాట్లాడకుండా కాఫీలు త్రాగారు.

"మా కిద్దరికీ రేపు సాయంత్రందాకా టైంకావాలి! అందాకా నువ్విక్కడే వుండు. ఈ లోపల మేము మిగిలిన డబ్బు ప్రోగుచేస్తాం. ఆ తర్వాత మన పథకం ప్రారంభం చేద్దాం!" అన్నాడు ఆనంద్.

"ఉంటాను. కానీ ఈ క్షణంనుండి నా ఖర్చులు

మొత్తం మీరే భరించాలి. అందుకు ఇష్టమేనా?'' అడిగాడు సుందర్.

మోహన్ జేబులోంచి రెండు వంద కాగితాలు తీసి సుందర్ చేతిలో పెట్టాడు సమాధానంగా. అతనిదగ్గర సెలవు పుచ్చుకుని ఇద్దరూ వెళ్ళిపోయారు.

గదిలోంచి వాళ్ళు వెళ్ళగానే తలుపులు బిగించాడు సుందర్. బ్రీఫ్ కేస్ తెరచి అందులోంచి విస్కీ తీసి టేబుల్ పైన పెట్టుకొన్నాడు. అంతకుముందు త్రాగుదామని తీశాడు. కానీ ఆనంద్, మోహన్ రావటంతో దాచేశాడు. వాళ్ళు త్రాగితే సీసా ఖాళీ అవుతుందన్న భయంలేదు. కానీ త్రాగిన తర్వాత వ్యాపార విషయాలు మాట్లాడితే అదంత సజావుగా వుండదు. అందుకే వ్యాపారానికీ, మందుకు లంకె పెట్టడు.

గ్లాసునిండా వొంపుకుని, కుర్చీ టీపాయ్ దగ్గరకు లాక్కున్నాడు.

తను వేసిన ప్లాను గుర్తుకొచ్చింది. తలచుకొంటే గర్వంతో కళ్ళు మెరిసిపోసాగాయి. భుజాలు పొంగుతున్నాయి. ఇటు మనుషుల్ని, అటు చట్టాన్ని తెలివిగా బోల్తాకొట్టించి ఆరులక్షల రూపాయలు సునాయాసంగా సంపాదించిపెట్టే మాస్టర్ ప్లాన్. అలాంటి ప్లాన్ను ఆలోచించగల తన బుర్రను తనే పదేపదే మెచ్చుకోసాగాడు.

రోజా గుర్తొచ్చింది. ఈపాటికి కలకత్తాలో ఏక్లబ్ లోనో నృత్యంచేస్తూ ఒక్కొక్క గుడ్డవిప్పి ఆడియన్స్ మొహాన పారేస్తూ వుంటుంది. చివరకు నగ్నంగా వాళ్ళ ముందు నిలబడి తన శరీరంలోని వొంపులు, సొంపులు మొత్తం చూపిస్తుంది రోజా. అందుకు వాళ్ళిచ్చేది

పాతిక రూపాయలు. తిండికీ, త్రాగుడికీ, మేకప్ కి చాలదది. దాంతో అప్పుడప్పుడు గదికి ఎవర్నో ఒకర్ని పిలుచుకుపోతుంది.

అలాంటి ఛాన్సు ఒకసారి సుందర్ కు తగిలింది. అప్పటినుంచే ఇద్దరూ ప్రేయసీప్రియులై పోయారు.

ఆమె జీవన విధానానికి సుందర్ అభ్యంతర పెట్ట లేదు. ఆమె అలవాట్లని మానుకోమని ఆంక్ష పెట్టలేదు. ఆమెకోసమే, ఆమెనా ఊబిలోంచి వెలుపలకి లాగేందుకు సుందర్ కు డబ్బు సంపాదించాలన్న ఆరాటం బయలు దేరింది.

గ్లాసులో విస్కీ పూర్తిగా త్రాగాడు సుందర్. బాత్ రూంలో కెళ్ళి మొహం కడుక్కుని వచ్చి, డ్రెస్ చేసుకొన్నాడు. రూంకు తాళం వేసి హోటల్ లోంచి బయట పడ్డాడు. జేబులో మోహన్ ఇచ్చివెళ్ళిన రెండు వంద నోట్లు వున్నాయో లేదో ఓమారు తడిమి చూసు కున్నాడు.

టాక్సీఎక్కి మౌంట్ రోడ్ జి పి ఒ దగ్గరకొచ్చి ఆగాడు. డబ్బులిచ్చి టాక్సీని పంపి లోనికెళ్ళాడు. జనం రద్దీగా వున్నారు. పగలంతా తీరుబాటులేని జనం, సాయంత్రం జి.పి.ఒ. కొచ్చిగాని ఉత్తరాలు రాయటం, డబ్బు M.O. చేయటం లాంటివి చెయ్యరనిపించిం దతనికి. స్టాంప్స్ కౌంటర్ కు వెళ్ళి ఇన్ లాండ్ కవరు కొనితెచ్చుకొని బెంచీమీద కూర్చుని రోజాకు ఉత్తరం రాయసాగాడు.

రాస్తూ తలపైకెత్తి చూశాడు. యం. ఒ. ల కౌంటర్ ముందు పాము మెలికలు తిరిగిపోతూంది క్యూ. దగ్గరలో సిగరెట్ దమ్ము కొడుతున్న మోహన్ కనిపించాడు.

చూచి నవ్వుతున్నాడు.

ఈ తరం రాసి చివర్లో 'నీ ప్రియమైన సుందర్' అని రాస్తుండగా 'దాంగ దాంగ' అంటూ కేకలు వినిపించాయి.

తలెత్తి చూశాడు సుందర్.

మోహన్ వడిసెల్లో రాయిలా జనం మధ్యనుండి దూసుకుని తనవైపు రావటం గమనించాడు.

సుందర్‌కు కాళ్ళు వణికాయి. అతనెప్పుడూ దొంగతనాలు చెయ్యలేదు. అతను అంతమంది చూస్తుండగా తన్ను పలకరిస్తే, చావు ఖాయమని తెల్సుకుని, కవరు తీసుకుని లేచాడు. అంతలోనే మోహన్ అతని దగ్గరకంటూ వచ్చేశాడు. అతన్ని తరుముకొస్తున్న జనానికీ, అతనికీ మధ్య పట్టుమని పదడుగుల దూరం లేదు.

మోహన్ డాష్ ఇచ్చాడు. దెబ్బతో క్రిందపడ్డాడు సుందర్. కన్నుమూసి తెరచేటంతలో లేచి వెలుపలికి వెళ్ళిపోయాడు. సుందర్ క్రిందపడే వున్నాడు.

"అతన్ని ఘట్టిగా పట్టుకోవాల్సింది!" కామెంటు చేశాడొకడు.

"వాడు ఆరితేరిన పిక్‌పాకెట్! పాపం అతని పర్సు కూడా కొట్టేశాడేమో చూసుకోమనండి!" ఇంకో వ్యక్తి సానుభూతిగా అన్నాడు.

సుందర్ లేచి నిల్చున్నాడు.

"ఇన్సూర్ చేద్దామని తెచ్చాను. రెండు వేలు పోయాయి" డబ్బు పోగొట్టుకున్న వ్యక్తి మొత్తుకున్నాడు.

సుందర్‌కు పరిస్థితి అర్థమయింది. పోలీసులు రావడం, అందర్నీ ప్రశ్నలతో వేధించడంలాంటి తతంగం ప్రారంభమవుతుంది. దానికిముందే తను అక్కడినుండి తప్పు

కోవడం మంచిదనుకుని ముందుకు నడిచాడు. అడ్రసు రాసి పోస్టుబాక్స్‌లో ఉత్తరం పడేశాడు. మొహమంతా చెమట పట్టింది. తుడుచుకుందామని జేబురుమాలుకోసం జేబులో చెయ్యిపెట్టాడు. లావుగా, ఘట్టిగా, కవరులాంటిదేదో చేతికి తగిలింది. కొద్దిగాలాగి చూశాడు. ఇన్స్యూర్డ్ కవర్ అది. మళ్ళా లోనికి తోసేశాడు.

మోహన్ పైన కోపమొచ్చింది సుందర్‌కు. అక్కడింకొక్కక్షణం వుండటం మంచిదికాదని గబగబ వెలుపలకొచ్చి టాక్సీ ఎక్కి హోటల్‌కు పోనిమ్మన్నాడు. టాక్సీ మౌంట్ రోడ్‌ను చీల్చుకుంటూ పరుగెత్తసాగింది.

2

లైట్లు ఆరిపోయాయి. సీట్లలో వెనక్కి జేరబడి కూర్చున్న జనం ముందుకు జరిగి కూర్చున్నారు. రంగంమీద తెర తొలగింది. నల్లటి సూట్‌లో వున్న వ్యక్తివచ్చి మైక్ ముందు నిలబడ్డాడు. అందరికీ వందనం చేస్తున్నట్లు ఒకమారు తలవంచి పైకెత్తి చెప్పసాగాడు:

“లేడీస్ అండ్ జంటిల్‌మెన్! స్వీట్ సిక్స్‌టీన్ నైట్ క్వీన్ మిస్ రోజా మరో కొన్ని నిముషాల్లో రంగం మీదకొచ్చి తన అన్ని అంగాల అందచందాలు పొందికగా మీకు చూపిస్తుంది. మీ కంటికీ, వొంటికీ, నరాలకు, ఇదో విందు. ఈ మిస్‌ను చూసే అవకాశం మిస్ అయిపోయిన మీ మిత్రులకు రేపే రమ్మని చెప్పండి. ఓ.కే.” అంటూ అతను తొలిగిపోయాడు.

మరో రెండు నిముషాలకు రోజా రంగంపైకి వచ్చింది.

డ్రమ్స్ పెద్దగా మ్రోగాయి.

ఆమె ఒక్కొక్కటే బట్టలు విప్పి దూరంగా విసిరేయసాగింది.

అందరూ ఆమెకేసి ఆకలిగొన్న సింహాల్లా చూడసాగారు.

ఎయిర్‌కండిషన్ హాల్లో చల్లదనం మాయమై వేడి పుట్టుకు రాసాగింది.

ఆమె పూర్తిగా వివస్త్రయింది.

ముందు సీట్లో కూర్చునున్న స్టీల్ మాగ్నెట్ సింగామియా లేచి నిలుచున్నాడు. రోజా గమనించింది. అతన్నే కనిపెట్టుకుని వుంది అంతకుముందునుంచి. స్టేజి ప్రక్కనున్న చెక్క మెట్లెక్కి రాబోయాడు. అలాంటి సంఘటనల కలవాటుపడ్డవాళ్లు కావడంచేత హాలు యజమానులు అక్కడో దుక్కముక్కలాంటి రౌడీని కాపలాపెట్టే వుంచారు.

ఆ రౌడీ సింగామియాను ఆపి "ఆమె కావాలా?" అడిగాడు నవ్వుతూ కోరమీసం మెలేస్తూ.

"ఆఁ!" అన్నాడు సింగామియా.

"ఇటుతిరిగి వెనక్కి వెళ్ళండి. మేకప్ రూంలో వుంటుంది. మాట్లాడండి!" అన్నాడు వాడు.

"థాంక్స్!" అంటూ జేబులోంచి వంద రూపాయల నోట్లకట్ట వెలుపలికిలాగి, దాన్లోంచి ఒకనోటు తీసి ఇచ్చాడు వాడికి. అందుకొని, సలాంచేశాడు.

సింగామియా ఆ రౌడీ చెప్పిన దోవనే వెళ్ళాడు మేకప్ గదిలోకి.

రోజా బ్రాసరీ తొడుక్కుంది. పెట్టీకోట్ బొందు బిగించుకుంటుంటే లోనికొచ్చాడు సింగామియా. ద్వారం ముందే నిలబడి "మే ఐ కమిన్!" అడిగాడు.

"ఎవరు మీరు!"

"చెన్నో స్టీల్ మిల్ ఓనర్ని. లెక్కలేనన్ని మిల్లు

లవ డైరక్టర్ను!" ఆ మాటలు చెప్తుంటే అతనిలో గర్వం, డబ్బుగలవాడినన్న ధీమా కొట్టవచ్చినట్లు కనుపించాయి.

"ఏం కావాలి?" అడిగింది రోజా, జాకెట్ అందుకుంటూ.

"నువ్వూ, నీ అందం!" అన్నాడు సింగామియా.

"సారీ! నువ్వు కొనలేవు!" అంటూ బట్టలు కట్టుకోవడంలో మునిగిపోయింది.

"అంటే!" అర్థంగాక అడిగాడు.

"ఈ రాత్రికి అమ్ముడయిపోయాను. నన్ను మధ్యాహ్నమే కొనుక్కున్నారు. ఇక్కడ్నుంచి తిన్నగా వాళ్ళదగ్గరకే వెళ్ళాలి. గ్రాండ్ హోటల్లో దిగారు" అంది రోజా అతన్ని కవ్వించేట్లు ఓరగా చూస్తూ.

"ఎంతకు కొన్నారు?"

"రెండు వేలకు."

"డబ్బిస్తాను వెళ్ళి నాలుగువేలు వాళ్ళ మొహాన కొట్టిరా?"

"వాళ్ళు మళ్ళా ఆరువేలిచ్చి మీకిచ్చి రమ్మంటే!"

"అంత డబ్బున్న వాళ్ళా!"

"తెలీదు! మద్రాసీలు. స్క్రాప్ మర్చంట్స్‌మని చెప్పారు. కోట్లమీద వ్యాపారం చేస్తారట" అంది రోజా.

"ఐ. సీ. ఏం స్క్రాప్ వాళ్ళు డీల్ చేసేది!"

"ఐరన్!"

"పోనీ రేపు వీలవుతుందా?" అడిగాడు సింగామియా.

"ఓ. కే. రేపయితే ప్రాబ్లమ్ లేదు" అంది రోజా.

"వాళ్ళెవరో, పేరేమిటో, వాళ్ళ కంపెనీ పేరేమిటో,

ఏమాత్రం సరుకుందో తెలుసుకునిరా. నాకు అవసర ముంది" అన్నాడు సింగామియా.

"నా బిజినెస్ అదికాదు."

"ఊరకే అడిగి తెలుసుకో. నాకు చెప్పు. అలా చెప్పి నందుకు నీకు ఇంకొంత డబ్బు విడిగా ఇస్తాను" అన్నాడు.

"అయితే కనుక్కుంటాను" అంది రోజా.

"రేపు హోటల్ గంగా రూం నెంబరు ఆరువందల ఆరవై ఆరులో నీ కోసం ఎదురుచూస్తుంటాను. షో కాగానే వచ్చెయ్యి" అన్నాడు వెయ్యిరూపాయలుతీసి అందిస్తూ.

"అలాగే!" అంది.

సింగామియా వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

రోజా బట్టలు పూర్తిగా కట్టుకొంది. హాండ్ బ్యాగ్ పుచ్చుకుని వెలుపలకొచ్చి టాక్సీ ఎక్కి తనరూం అడ్రస్ చెప్పింది. అరగంటలో కాళీఘాట్ చేరుకుంది టాక్సీ. చిన్న పెంకుటిల్లు చూపించి దానిముందాపమంది.

దిగి డబ్బిస్తూంటే డ్రైవరు రోజానే దీక్షగా పరిశీలించ సాగాడు. ఆమె ఏ రకం స్త్రీ అయివుంటుందో అర్థం చేసుకున్నట్లు తలూపుతూ "నీ ఇల్లు ఇదేనా?" అడిగాడు.

"నీ కెందుకు?" అడిగింది డబ్బిస్తూ.

డబ్బు అందుకునే ప్రయత్నం చెయ్యకుండానే "బేరాలు కావాలంటే తెద్దామని. ఫిఫ్టీ పర్సెంట్ కమీషను ఇచ్చేట్లయితే మంచి గిరాకీలు తెస్తాను" అన్నాడు అతను.

రోజాకు వొళ్ళు కంపరం పుట్టింది. వాడివంక కోపంగా చూసి "నీ సాయం అవసరంలేదు! నోరుమూసుకుని వెళ్ళు!" అంది డబ్బు విసిరి మొహానకొడ్తూ.

డ్రైవరు అందుకని గుట్టుగా వెళ్ళి టాక్సీ ఎక్కి స్టార్ట్ చేశాడు. రోజా హాండ్ బ్యాగ్ తీసి అందులోంచి తాళాల గుత్తితీసి, తలుపులకున్న కప్ప తెరచింది. లైటు వెలిగించి ఉత్తరాలేమన్నా వచ్చాయేమోనని ఆతృతగా వెతికింది. ఏదీ రాలేదు.

సుందర్ పైన కోపం వచ్చింది. వెళ్ళి వారం దినం లయింది. వెంటనే వుత్తరం రాస్తానన్నాడు. సరిగ్గా రాసుంటే ఈ పాటికి రెండుత్తరాలు వచ్చి వుండాల్సింది. తన్ను మరచిపోయాడేమో ననుకుంది.

అతనే ఎలాగైనా సింగామియాను వల్లో వేసుకో మన్నాడు. అతని ద్వారానే తను పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించేందుకు పథకం వేసుకున్నాడు. అందు వల్ల అతను తన్ను మరచిపోయేందుకు అవకాశంలేదు.

సుందర్ విచిత్రమైన మనిషి. డబ్బుకోసం ఎంత నీచానికైనా పాల్పడే రకమని తొలి పరిచయంలోనే రోజాకు అర్థమైంది. అయినా అతన్ని ప్రేమించింది. అందుకు కారణం అతని అందంకాదు. లేమి! తిండికోసం, గుడ్డకోసం, నమ్మకంగా తన్ను నమ్ముకొని పడివుండక తప్పదు అతను.

పరిచయం పెరిగాక, సుందర్లో వచ్చిన మార్పుల్ని గమనించింది. తన తిండి తినటం, తన డబ్బుతో బట్టలు కొనుక్కోవటం అతనికి కాస్త కష్టమనిపించినట్లుంది. ఎలాగైనా డబ్బు సంపాదించాలన్న తాపత్రయం కనిపించాయి. రోజుల తరబడి ఈ పెంకుటింట్లో ఒంటరిగా పడుకుని ఆలోచించి పథకం వేశాడు.

ఒకరోజు సుందర్ తను వేసిన మాస్టర్ ప్లాన్ చెప్పాడు. విని విస్తుపోయింది. అలాంటివి కథల్లో జరుగుతాయేమో

తప్పు, నిజంగా జరగటం అసంభవమనిపించింది. అయినా అతన్ని నిరుత్సాహ పరచడం ఇష్టలేక మౌనంగా వింటూ వుండిపోయింది. అంతా చెప్పి "ఎలావుంది నా ప్లాను!" అడిగాడు గర్వంగా.

"బ్రహ్మాండంగా వుంది!" అంది తను.

"అయితే మనం ప్రారంభిద్దామా పని..."

"అలాగే!" అంది తను.

ఆ తర్వాత నాలుగు రోజులకు మద్రాసుకు బయలుదేరి వెళ్ళాడు. మళ్ళీ అతని దగ్గరనుండి ఉత్తరం రాలేదన్న విషయం గుర్తొచ్చి మళ్ళీ కాస్త నిరుత్సాహం కలిగింది.

"రోజా! రోజా!" అంటూ వీధిలోంచి పిలిచారు.

"ఎవరూ?" అంటూ వెళ్ళి తలుపు తీసింది.

ప్రక్కింటి చటర్జీ గారు కనుపించారు. ఆయనకు నలభై సంవత్సరాల వయసుంటుంది. తెలుగు దేశంలో ఉద్యోగం చేసి వచ్చాడు. అందువల్ల తెలుగు బాగా మాట్లాడుతాడు.

"మీరా? ఏమిటి?" అడిగింది రోజా.

"నీకు ఉత్తరం వచ్చిందమ్మాయి. ఎక్స్‌ప్రెస్ డెలివరీ. సంతకం చేయించుకుని గాని ఇవ్వడానికి వీల్లేదన్నాడు. నేనే తీసుకున్నాను" అన్నాడు చటర్జీ.

"థాంక్స్! ఏదీ తెచ్చారా?"

"ఇంట్లో వుంది. నువ్వు వచ్చావో లేదో చూద్దామని వచ్చాను."

"కాస్త త్వరగా పంపిస్తారా? నేను దానికోసమే ఎదురు చూస్తున్నాను."

"అవునవును. చదివితే అర్థమయింది అది ఎంత ముఖ్యమైన ఉత్తరమో. అలాంటిదానికోసం ఆతృతగా ఎదురుచూడటంలో తప్పు లేదమ్మా?" అన్నాడు చటర్జీ.

రోజా నమ్మలేకపోయిందా మాటలు.

"మీరు చదివారా?"

"ఆఁ! వద్దనుకుంటూనే ఉబుసుపోక చదివాను."

"దాంట్లో విషయాలు తెలుసుకోవడం మీ క్షేమాని కంత మంచిదిగాదు. త్వరగా ఉత్తరం తెచ్చి ఇవ్వండి" అంది రోజా.

"నాకలా కనిపించలేదు. అది చదివాక నాకు తమాషా ఐడియా వచ్చింది. నీతో బేరం చేద్దామనుకున్నాను."

"బేరమా? నాతోనా?"

"ఆఁ! నీతోనే! ఉత్తరంలో విషయాలు మరిచిపోయేందుకూ, నీ ఉత్తరం నీ కిచ్చేందుకూ, ప్రతిఫలంగా ఈ రాత్రి నేను నీతో గడపాలి. ఇష్టమేనా?"

కాళ్ళ కాటికి లాగుతుంటే కళ్లు మరో పెళ్ళాన్ని కోరుకుతున్నట్లుంది చటర్జీ వాలకం. ఒక్క క్షణం ఆలోచించింది. చటర్జీ కేసిచూసి "అలాగే! వెళ్ళి ఉత్తరం తీసుకురండి!" అంది రోజా.

చటర్జీ వెళ్ళిపోయాడు. రోజా లోనికొచ్చి ఇల్లంతా కాలికి సుందర్ వదిలి వెళ్ళిపోయిన హాండ్ స్టిక్ తెచ్చి తలుపు వారగా పెట్టింది.

పదినిముషాల తర్వాత తెల్లటి పంచెకట్టి, లాల్చీ వేసుకుని, వాట్నిండా సెంటు పులుముకుని వచ్చాడు చటర్జీ. వస్తూనే జేబులోంచి ఉత్తరంతీసి అందించాడు. దాన్నందుకుని జాకెట్టులో దోపుకుంది రోజా! అతనే తలుపులు మూశాడు. పైకి సింహంలా దూకాడు. తప్పుకొని తలుపువారకు చేరింది. అక్కడ అంతకుముందే వుంచిన చేతికర్ర తీసుకుని భద్రకాళిలా హుంకరిస్తూ పైకెత్తింది.

చటర్జీ చూసి బిక్కచచ్చిపోయాడు. నోట మాట లేకుండా నిలబడ్డాడు.

"వెళ్లు! స్కౌండ్రల్!" తిట్టింది.

మాట్లాడకుండా తలుపు తెరచుకుని వెళ్ళిపోయాడు. వెంటనే తలుపులు మూసి గొళ్ళెం పెట్టి, ఉత్తరం తీసి చదివింది. అందులో పెద్దగా వివరాలు రాయలేదు సుందర్. తను వెళ్ళిన పని అయిందనీ, నాల్రోజుల్లో వస్తున్నాననీ, అప్పటికి తను వలవేసి పట్టుకోమన్న చేపను ఎలాగైనా చేజిక్కించుకోమని రాశాడు.

చటర్జీకి ఉత్తరంలో అర్థమయ్యే విషయాలు ఏవీ లేనందుకు సంతోషపడింది రోజా! కానీ పోలీసులకు రిపోర్టిచ్చి తనపైన అనుమానంగా వుండంటే వాళ్లు తన వెంట పడతారు. ఎందుకయినా తను మరోక్షణం అక్కడుండటం మంచిది కాదనిపించింది. గబగబ బట్టలు సూట్ కేస్ లో సర్దుకుంది. కిటికీలన్నీ మూసి తలుపులకు గొళ్ళెంబెట్టి తాళం వేసింది.

సూట్ కేస్ తో సహా టాక్సీఎక్కి 'హౌరా' స్టేషనుకు పోనిమ్మంది. దిగి డబ్బిచ్చి స్టేషనులోకి వెళ్ళింది. బండ్ల రాకపోకలు తెలిపే బోర్డుకేసి చూసింది. మరుసటి దినం ఉదయందాకా మద్రాసుకు రైలు లేదు. ఉన్నా ఆమె వెళ్ళదలచుకోలేదు. సింగామియా సంగతి చూడవలసిన అవసరముండడంతో, సుందర్ కు టెలిగ్రాం ఇచ్చింది, తన్ను హోటల్ పారడైజ్ లో కలుసుకోమని. ఆతర్వాత మరో టాక్సీ ఎక్కి పారడైజ్ కు వెళ్ళి రూం తీసుకుంది. దోవపొడుగునా, చటర్జీ గానీ, పోలీసులుగాని వెంట వస్తున్నారేమోనని చూచుకుంటూనే వుంది. కానీ ఎవ్వరూ వెంటబడకపోవడంతో ధైర్యం కలిగింది.

3

సుందర్ నిద్రలేచాడు. కిటికీలోంచి సూర్యకిరణాలు బెడ్ మీద పడుతున్నాయి. లేచి టైం చూసుకున్నాడు పదయింది. గబగబ స్నానంచేసి బట్టలు మార్చుకుని, బెల్ నొక్కి బాయ్‌ని పిలిచాడు. వాడు రాగానే కావలసిన టిఫినుకు ఆర్డరు చేశాడు.

బాయ్‌కోసం ఎదురు చూస్తూండగా, ఆనంద్, మోహన్ ఇద్దరూ లోనికి వచ్చారు.

"ఇప్పుడేనా లేవడం?" అడిగారిద్దరూ ఒక్కమారే కుర్చీల్లో కూర్చుంటూ.

"ఆఁ! మోహన్ నువ్వు దొంగవని తెలుసుగానీ, అంత డేర్ డెవిల్ వనుకోలేదు" అన్నాడు సుందర్.

"జి.పి.ఒ.లో గొడవను గురించా?" అడిగాడు అతను తాపీగా.

"ఆఁ! నువ్వు చేసిన పనికి, నేను జాగ్రత్తగా లేకుంటే, వాళ్ళకు చిక్కిపోయేవాడినే. చావదన్నే వాళ్ళు. అయినా ఆ కవరు నాకివ్వడంలో నీ ఉద్దేశం ఏమిటి?"

"ఏముంది? ఎటూ నీకివ్వవలసిందేగా ఆ డబ్బు. అక్కడే ఇచ్చాను" అన్నాడు అతను.

"నేను చచ్చాను. అది చూడగానే ప్రాణం పైనే పోయింది."

"అది సరే! అందులో ఎంత వుంది?" అడిగాడు ఆనంద్.

"రెండు వేలు!"

"మిగిలిందికూడా మేము సిద్ధంచేశాం. మన ప్లాన్ ప్రారంభం ఎప్పుడు చేద్దాం!" అడిగాడు ఆనంద్.

"నాదేం ఆలస్యం లేదు. ఇక్కడ మనం చేసుకో వలసిన ఏర్పాట్లన్నీ చేసుకుందాం. ఈలోగా నాకు కలకత్తానుండి సమాధానం వస్తుంది. వెంటనే ఆక్షన్ ప్రారంభ మవుతుంది" అన్నాడు సుందర్.

"ఇంపాలా ఎయిర్ కండిషన్డ్ కారొకటి వారం దినాలకు అద్దెకు తీసుకోవాలి. హోటల్ డ్రీమ్‌లాండ్‌లో రెండు కాటేజీలు అద్దెకు తీసుకోవాలి!" చెప్పి ఆగాడు సిగరెట్ ముట్టించుకునేందుకు.

"అవి సులభంగానే ఏర్పాటు చేయవచ్చు. నేనడిగేది వేరే విషయాల గురించి" అన్నాడు ఆనంద్.

"ఈ వూళ్ళోకల్లా ఐరన్ స్క్రాప్ ఎక్కువున్న కంపెనీ ఏది."

"సౌత్ ఇండియా స్టీల్ కంపెనీ!"

"వాళ్ళ డిపో ఎక్కడుంది?"

"ఆవడి దగ్గర."

"అక్కడ ఇన్‌చార్జిగా పనిచేసే దెవరో, ఎన్ని టన్నుల స్టాకుందో తెలుసుకోవాలి. అతన్ని చిన్నగా వల్లో వేసుకుని మన ప్లాన్ నచ్చచెప్పాలి. అందుకు ప్రతిఫలంగా అతనికి ఐదు వేలు ఇస్తామని చెప్పాలి. అక్కడ మన పని మొత్తం అరగంటసేపు మాత్రమే!" అన్నాడు సుందర్.

"ఓకే! అదంతా నేను కట్టుదిట్టం చేస్తాను" అన్నాడు మోహన్.

"ఈలోగా కలకత్తా నుంచి సమాచారం అందగానే, నేనూ, ఆనంద్ ఇద్దరం విమానంలో వెళ్ళి ప్రోగ్రాం ఫిక్స్ చేసుకొస్తాం!" అన్నాడు సుందర్.

"ప్లానయితే బాగుంది. అంత సులభంగా అవతల మనిషి మనల్ని నమ్మతాడని నీకు ధైర్యం వుందా?" అడిగాడు మోహన్.

"వుంది గాబట్టే ప్రయత్నాలు చేస్తున్నాను. మీరు డబ్బు తెచ్చారు. దాంతో మీ పనయిపోయింది. ఇక పైన మీరు చెయ్యవలసిందల్లా నే చెప్పినట్టు వినటమే!" అన్నాడు సుందర్.

బాయ్ వచ్చి టిఫిను కాఫీ సర్వ్ చేశాడు. మరో రెండు కాఫీలు తెమ్మని పురమాయించాడు సుందర్. అవికూడా వచ్చాయి. అందరూ త్రాగారు.

అంతలోనే పోస్ట్ మెన్ వెతుక్కుంటూ వచ్చి, టెలిగ్రాం అందించి సంతకం తీసుకున్నాడు. పోస్ట్ మెన్ వెళ్ళిపోయాక చించి చదివాడు.అతని కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"ఎక్కడ్నుంచి టెలిగ్రాం?" అడిగాడు ఆనంద్.

"కలకత్తా నుండి.అక్కడ అన్ని ఏర్పాట్లు పూర్తయి నాయి. మనం ఇవాళే వెళ్ళాలి. మనం తిరిగొచ్చేలోగా మోహన్ మిగిలిన ఏర్పాట్లన్నీ చేస్తాడు. ఓ.కే." అన్నాడు సుందర్.

ఆనంద్ మోహన్ కేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

"అలాగే చేస్తాను."

"మేము అక్కడ ఎప్పుడు బయలుదేరేది నీకు తెలియ పరుస్తాను. నువ్వు ఇంపాలా తీసుకుని ఎయిర్ పోర్టుకు రా. డ్రీమ్‌లాండ్ లో రెండు రూములు బుక్ చేసి వుంచు. అవడిలో ఆ డిపో ఇన్ ఛార్జితో అన్ని వ్యవహారాలు తేల్చి వుంచుకో. ఒక మంచి పార్టీ ఇవ్వాల్సి వుంటుంది. ఆ వచ్చే వ్యక్తి ఒక రాత్రికిక్కడ వుండదలనుకుంటే

మంచి అందమైన అమ్మాయిని మనం అతనికి సరఫరా చెయ్యాలి. అదిగూడా చూసి వుంచు'' అన్నాడు సుందర్, అతని చేతికి ఐదువేల రూపాయలు లెఖపెట్టి ఇస్తూ.

''అలాగే!''డబ్బు అందుకుంటూ చెప్పాడు మోహన్.

సుందర్ ఫోనందుకుని ఇండియన్ ఎయిర్ లైన్స్ బుకింగ్ ఆఫీసుతో మాట్లాడాడు. సాయంత్రం ఆరు గంటలకు కలకత్తా పోయేందుకు విమానం వుందని చెప్పారు వాళ్ళు. ఫోన్ పెట్టేసి ''ఆనంద్! మనం మౌంట్ రోడ్ వెళ్ళి రెండు టిక్కెట్లు బుక్ చేద్దాం. మోహన్ తన పని మొదలు పెడతాడు.'' అన్నాడు. వెంటనే బట్టలు మార్చుకుని సిద్ధమైనాడు'' తలుపులు మూసి తాళం వేసి అందరూ వెలుపలికొచ్చారు.

టాక్సీ ఎక్కారు ముగ్గురూ.

రివ్వుమని దూసుకుపోయింది మౌంట్ రోడ్ వైపు.

మోహన్ మిగిలిన ఇద్దరిదగ్గర శెలవు పుచ్చుకుని వెళ్ళిపోయాడు.

ఆనంద్, సుందర్ ఎయిర్ లైన్స్ ఆఫీసులోని కెళ్ళారు. టిక్కెట్లు కొనుక్కున్నారు. పేర్లు మార్చుకున్నారు. సిల్క్ పాలెస్ లోని కెళ్ళి ఖరీదైన రెండు సూట్లుకొన్నారు. ఒక వి. ఐ. పి.సూట్ కేస్ కూడా ఖరీదు చేశారు.

మళ్ళా హోటల్ కు వెళ్ళేందుకు టాక్సీ కుదుర్చుకున్నారు.

''కలకత్తానుండి వచ్చిన వైర్ లో చివర్న రోజా అని వుందే! ఎవరామె?'' అడిగాడు ఆనంద్. అతనికి ఆడవాళ్ళంటే పెద్ద వీక్ నెస్ వుంది.

''ఆమె నా భార్య'' చెప్పాడు సుందర్.

"ఏం చేస్తూంటుంది."

"అందరు ఆడవాళ్ళలాగే నాతో కాపురం చేస్తుంటుంది. నా పనుల్లో సాయం చేస్తుంది."

"నీ మాస్టర్ ప్లాన్ ఆమెకు తెలుసా?"

"తెలుసు. దీని వెనుకనున్న బ్రెయిన్ చాలామటుకు ఆమెదే!"

"అందంగా వుంటుందా?"

ఆ ప్రశ్నతో రక్తం వడిగా ప్రవహించింది సుందర్ శరీరంలో.

"మన స్నేహితం వ్యాపారరీత్యా మాత్రమే! నా భార్య అందచందాలు, వివరాలు నీ కనవసరం!" అన్నాడు కోపంగా సుందర్.

ఆనంద్ తను అతని భార్యను గురించి ప్రస్తావించడం నచ్చలేదని అర్థం చేసుకున్నాడు. కానీ ఆ పేరులోనే ఒక రకమైన మత్తు, అందం అతనికి కనుపించాయి. ఆమెను చూసే అవకాశంకోసం తొందరపడసాగాడు.

తిరిగొచ్చాక ఇద్దరూ మౌనంగానే వుండిపోయారు. భోజనాలు ముగించి కాసేపు రెస్ట్ తీసుకున్నారు. నాలు గంటల ప్రాంతంలో గది ఖాళీ చేస్తున్నామని చెప్పి బిల్ తెప్పించుకుని డబ్బిచ్చి పంపారు.

ఐదింటికల్లా మీనంబాకం విమానాశ్రయంలో అడుగు పెట్టారు. సెక్యూరిటీ చెక్ ముగిసేసరికి మరో ముప్పావు గంట పట్టింది. విమానంవచ్చి ఆగింది. అందరూ ఎక్కారు. ఆనంద్ కు విమానం ఎక్కడం అదే మొదటిసారి. సుందర్ అంతకుముందో రెండుసార్లు ప్రయాణం చేశాడు.

ఆరింటికల్లా తలుపులు మూతపడ్డాయి. వెంటనే రన్ వే మీద విమానం పరుగెత్తసాగింది.

ఎనిమిదిన్నరకల్లా విమానం డమ్‌డమ్ విమానాశ్రయంలో దిగింది. సుందర్ ఆనంద్ ఇద్దరూ దిగి టాక్సీ ఎక్కి "పారడైజ్ హోటల్‌కు పోనీ!" అన్నారు.

కలకత్తా వీధులకేసి చూస్తూ మౌనంగా కూర్చున్నాడు ఆనంద్. వున్నట్టుండి "మీ ఇంటికి వెళ్ళనవసరంలేదా?" అడిగాడు.

"ఎందుకు?"

"మీ ఆవిడను కలుసుకునేందుకు."

"ఆమెను చూసేందుకే వెళ్తున్నది."

"హోటల్‌లో బసచేసిందా?"

"ఆఁ! మన ప్లాన్ నెరవేరేదాకా నేను హోటల్‌లో వుండమని చెప్పాను" అన్నాడు సుందర్.

టాక్సీ హోటల్ కాంపౌండ్‌లోకి దూరింది.

రిసెప్షన్ కౌంటర్ ముందు నిలబడ్డాడు సుందర్.

"సారీసార్! నో వేకన్సీస్!" అన్నాడు కౌంటర్‌లో వున్న వ్యక్తి.

"మద్రాసునుండి వచ్చాం! సింగిల్ రూమయినా ఫరవాలేదు!"

"ఏదీలేవు సార్! ట్రిబుల్ రూంవుంటే ఒకమ్మాయి రెండ్రోజులక్రితం రాత్రిపూటవచ్చి బలవంతంచేసి తీసుకొంది" అన్నాడతను.

"ఆమెనడుగు మన్మల్నిద్దరినీ మరో రూం ఖాళీ అయ్యేదాకా అకామిడేట్ చేస్తుందేమో?" అన్నాడు సుందర్.

"సారీ! ఒంటరిగా వుందామె! నేనెలా అడిగేది? మీరే వెళ్ళి ట్రై చెయ్యండి. రూం నెంబరు అరవైరెండులో వుంది" అన్నాడతను.

ఆనంద్‌ను అక్కడే వుండమని, సుందర్ లోని

కెళ్ళాడు.

మెల్లగా వెతుక్కుంటూ అరవై రెండో నెంబరు గది వద్ద కెళ్ళాడు. తలుపులు మూసివున్నాయి. కిటికీలకున్న కర్టెనులుకూడా బిగించి వుంచారు. లోపలెవరుందీ ఏం చేస్తున్నదీ చూసేందుకు వీలుకాలేదు సుందర్‌కు.

తలుపు ప్రక్కనేవున్న బజ్జర్ నొక్కాడు.

రెండు నిమిషాల తర్వాత గుమ్మం తలుపులు తెరుచుకున్నాయి. వాటిమధ్యనుండో బట్టతల వెలుపలకు తొంగి చూసింది. సుందర్ అతనికేసి చూశాడు. కళ్ళు ఎర్రగా వున్నాయి. విస్కీ వాసన గుప్పుమని కొట్టింది.

"ఎవరు కావాలి?" అడిగాడతను.

"ఈ గదిలో వున్న అమ్మాయికోసం వచ్చాను" అన్నాడు సుందర్ తొణక్కుండా.

"అమ్మాయా? ఎవరూ లేరే! నా వైఫ్ వుంది."

"అబద్ధం చెప్పి లాభంలేదు! ఆమే నన్ను రమ్మంది. మర్యాదగా వెళ్ళి చెప్పు. లేకంటే పోలీసులకు రిపోర్టు చేస్తాను. సింగామియా యిలా ఎవరో అమ్మాయిలతో హోటల్‌లో కలుసుకుంటున్నాడని పేపర్లలో వేయిస్తాను!" అన్నాడు సుందర్ తొణక్కుండా.

ఆగంతకుడు తలుపు పైనున్న చెయ్యి తీసేసాడు.

"నన్నెలా తెలుసు నీకు!" అడిగాడు సింగామియా.

"నిన్నే కాదు! నీతో వున్న అమ్మాయిని కూడా తెలుసు!"

"నువ్వెవరు?"

"సుందరేశన్, సదరన్ స్టీల్ కార్పొరేషను నాదే! నీ ఫోటో చాలా సార్లు పేపర్లో చూశాను" అన్నాడు సుందర్.

"లోపలకు రా!" అన్నాడు సింగామియా త్రోవ వదులుతూ. సుందర్ అతన్ని అనుసరించాడు.

బెడ్ పైన నగ్నంగా పడుకొనున్న రోజా సుందర్‌ను చూడగానే కన్నుకొట్టింది.

"రోజా! అతన్ని రమ్మని చెప్పి, నన్ను రప్పించావెందుకు?" అడిగాడు సింగామియా.

"మీ హోటల్‌కు వస్తానంటే మీరే వద్దన్నారు. అందుకని రమ్మన్నాను. ఇతనేమో నిన్న వచ్చి వెళ్లాడు. ఈ దినం వీలుకాదన్నాను. వినకుండా వచ్చాడు" సర్ది చెప్పింది.

"మీ ఆనందానికి అడ్డం రాదలచుకోలేదు! మీతో నాకు పనుంది" అన్నాడు సుందర్.

"చెప్పు!" సిగరెట్ ముట్టించుకుంటూ అన్నాడు.

"లక్షల టన్నులకొద్దీ స్క్రాప్ ఐరన్ జపాన్‌కు ఎక్స్‌పోర్టు చేసేందుకు మీరు ఆర్డరు సంపాదించినట్లు తెలిసింది. మా దగ్గర ఐదు లక్షల టన్నుల స్టాకుంది. నేను ఆర్డరు కోసం ప్రయత్నం చేశాను. చిక్కలేదు."

"అయితే!"

"మా సరుకు కూడా మీరే తీసుకోవాలి!"

"నా దగ్గర కావలసినంత వుంది. పైగా డబ్బుకూడా లేదు. రెండు నెలలు ఆగగలిగితే తీసుకుంటాను."

"అలాగే! కానీ స్టాకు వాగన్‌లలోకేసి డాకుమెంట్లు బ్యాంకు ద్వారా పంపుతాను. దానివల్ల తొంభై శాతం డబ్బు బ్యాంకు ఇస్తుంది. మీరు విడిపించుకున్నాకే మిగిలింది తీసుకుంటాను" అన్నాడు సుందరేశన్‌గా చలామణీ అవుతూన్న సుందర్.

"అందుకు నాకభ్యంతరం లేదు! కానీ మీ దగ్గరున్న

స్టైల్ నేను చూడాలి!'' అన్నాడు సింగామియా.

''చూపిస్తాను. నాతో మద్రాసుకు వస్తారా?''

''వస్తాను. రేపు ఉదయం విమానంలో పోదాం! మళ్ళా తిరిగి సాయంత్రం వస్తాను'' అన్నాడు సింగామియా.

''ఓ యస్! అయితే రేపే మనం వెళ్ళేందుకు టిక్కెట్లు బుక్ చేస్తాను'' అన్నాడు సుందర్.

''అవసరం లేదు. నా స్వంత విమానం వుంది. అందులో వెళ్దాం. రోజా! నువ్వుగూడా వస్తావా? సరదాగా వెళ్ళొద్దాం!'' అన్నాడు సింగామియా.

''వస్తాను. నా కూడా మద్రాసు చూడాలని వుంది'' అంది రోజా.

''గుడ్! మొత్తం ముగ్గురమన్నమాట!''

''లేదు! నా ఫ్రెండ్ కూడా ఒకతను న్నాడు. నలుగురం వెళ్దాం. మీకేం అభ్యంతరం లేదుగా?'' అడిగాడు సుందర్.

''నాకేం అభ్యంతరం లేదు. మీ ఏర్పాట్లు మీరు చేసుకోండి. వెళ్ళండి'' అన్నాడు సింగామియా.

''వస్తాను. వచ్చినపని కాకున్నా అసలు పనయింది'' అన్నాడు సుందర్ సెలవు తీసుకుంటూ.

4

సింగామియా అతన్ని వెలుపలికి పంపి తలుపు గొళ్ళెం పెట్టి మంచంమీద రోజా పక్కన కూర్చున్నాడు.

''మీకు స్వంత విమానం వుందా?'' అడిగింది రోజా ఆశ్చర్యంగా.

''ఉంది!'' అన్నాడు మళ్ళీ విస్కీ గ్లాసు అందుకుంటూ.

"వీళ్ళకు మరెవ్వరూ దొరకలేదు కాబోలు. మీ వెంట పడ్డారు" అంది రోజా తనపైన ఏ విధమైన అనుమానం అతనికి రాకుండా వుండాలన్న ఉద్దేశ్యంతో.

"దొరక్క కాదు! నన్ను దొరకబుచ్చుకునేందుకు. డబ్బున్న ప్రతివాడూ ఒక బాధకున్న నమ్మకం ఇలాంటి వెధవలకుంటుంది. ఇన్నేళ్ళుగా ఈ వ్యాపారంలో వున్న నాకు మద్రాసులో వున్న కంపెనీలు, వాటి ఓనర్లు, వాటి వ్యాపారపద్ధతులు తెలీవని, ఏదో రకంగా బుట్టలో వేసుకొని, నానుంచి డబ్బు గుంజాదామని వాళ్ళ ఐడియా. వీళ్ళేదో గ్యాంగుకు సంబంధించిన మనుషుల్లా వున్నారు" అన్నాడు సింగామియా.

రోజా ఊపిరి ఆగిపోయింది. కత్తితో ఎవరో గుండెల్లో పొడిచి నట్లనిపించింది. ఇంత సులభంగానే సుందర్ అసలు రూపం కనిపెట్టిన సింగామియా ఏం చెయ్యదలచుకున్నాడో ఆమెకు అనూహ్యంగా వుంది. అతనికున్న డబ్బు, పలుకుబడి, హోదాతో నిలువునా చంపి, గొయ్యితీసి పాతిపెట్టినా అడిగేవాళ్ళెందరన్న విషయం ఆమెకు అవగాహనకొచ్చింది.

సింగామియా చెయ్యి రోజాపైన వేశాడు. చల్లగా తగిలింది. అంతకుముందుదాకా నిప్పులు గ్రక్కుతున్నట్లున్న ఆమె వొంట్లో అంత చల్లదనం ఎందుకు వచ్చిందో అర్థంకాలేదు.

"ఏమిటలా డల్‌గా వున్నావు?" అడిగాడు సింగామియా.

"ఏం లేదు! వాళ్ళ గురించి మీరు చెపుతుంటే భయం పుట్టింది. డబ్బు కోసం ఏమైనా చేసేవాళ్ళలా వున్నారన్నప్పటినుంచీ నాకు భయంగా వుంది. రేపు

మీతో నేను రాను!'' అంది రోజా.

''నీకేం భయంలేదు. వాళ్ళను ఉక్కు బంధాల్లో ఇరికించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తాను. నాతో రా! నువ్వంటే నాకు చచ్చేంత మోజుగా వుంది. విమానం నీకిచ్చేస్తాను. మంచి బంగళా కొనిపెడతాను. డబ్బిస్తాను. నీకేం కావాలన్నా క్షణాల్లో అమరుస్తాను. నాతో వుండు'' అన్నాడు సింగామియా ఆమెను బలంగా తన కౌగిట్లోకి లాక్కుంటూ.

''ఉంటాను. కానీ రేపు మాత్రం నన్ను వాళ్ళతో రమ్మని పిలవద్దు!'' అంది రోజా తన అసలు రూపం అతను అర్ధం చేసుకుని, వాళ్ళకు చేసే శాస్తి, తనకూ చేస్తాడన్న భయంలో.

''నిన్నొదిలిపెట్టి క్షణం కూడా వుండను. నువ్వు వెంబడుంటే నాకు ధైర్యంగా వుంటుంది. వాళ్ళ నెలా ఏడిపిస్తానో చూద్దువుగాని రా!'' అన్నాడు.

అతనితో వాదించి లాభంలేదని రోజా చివరకు ''సరే! అలాగే వస్తా!''నంది.

ఆ తర్వాత అలా గంటసేపు ఆమెకు ఊపిరాడనివ్వలేదు సింగామియా. అలసిపోయి మంచంపైన వాలిపోయాడు.

రోజాకు ఎటూ పాలుపోలేదు. సుందర్‌ను కలుసుకుని వాళ్ళ నిజరూపాల్ని అతను తెలుసుకున్నాడనీ, మళ్ళీ అతని ఛాయలకు రాకుండా వెళ్ళిపొమ్మని హెచ్చరిద్దామనుకుంది. అందుకు సుందర్ ఎక్కడ దిగిందీ చెప్పలేదు. ఫోన్ చేసి కౌంటర్‌ను పిలిచి అడుగుదామనుకుంది. సింగామియా తను వాళ్ళ తాలూకు మనిషని గ్రహిస్తాడేమోనని భయం పుట్టి, జరగవలసిందేదో జరుగుతుందన్న నిర్ణయాని

కొచ్చి, తనూ మంచంపైన వాలిపోయింది.

తిరిగి మళ్ళా వాళ్లు తెలిసేసరికి గదంతా పగటివెలుగుతో తెల్లగా మెరిసిపోతూంది. ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతూన్న సింగామియా మాటలు వినిపించాయి. కదలకుండా అలాగే పడుకుని ఆలకించసాగింది. అతను సంభాషణ ముగించి, మంచం వద్దకొచ్చి "గంట తొమ్మిదయింది. మరో గంటలో మనం మద్రాసుకు బయలుదేరుతున్నాం. వెళ్ళి స్నానం చేసిరా డ్రెస్ చేసుకుందువుగాని!" అన్నాడు

రోజా లేచి వొళ్ళు విరుచుకుంటూంటే విస్తుపోయి చూడసాగాడు.

బాత్‌రూం తలుపు మూసుకుని బోల్ట్ వేసుకుంది. గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి తను విన్నది తలచుకుంటే.

మద్రాసులో సదరన్ స్టీల్ కంపెనీతో మాట్లాడి తన దగ్గరకొచ్చిన ముఠా సంగతి చెప్పి, వాళ్ళను తీసుకుని విమానంలో వస్తున్నాననీ, వాళ్ళను అరెస్టు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగా వుంచమనీ చెప్పాడు సింగామియా. ఆ తర్వాత ఆఫీసుకు ఫోన్ చేసి విమానంలో వెంటవచ్చేందుకిద్దరు ఉక్కు కడ్డీల్లాంటి మనుషుల్ని అవసరమైతే పదిమందితో పోరాడగలిగే వాళ్ళను ఎయిర్‌పోర్టుకు పంపమన్నాడు. సుందర్ జీవితాంతం కమ్ములు లెఖపెట్టడం ఖాయమని నిర్ణయాని కొచ్చింది రోజా. అలాంటి వానితో ఈ పరిస్థితుల్లో అనుబంధం త్రెంచుకోవడం, తనకు క్షేమమన్న విషయం అర్థమైంది. అతనేమయినా తను బాధపడకూడదనుకొంది. అతన్ని తెలియనట్లే ప్రవర్తించదలచుకొంది.

స్నానంచేసి వెలుపలికొచ్చేసరికి, సింగామియా రివాల్వరు తుడుస్తూ కూర్చున్నాడు. వేలెడంత పొడవుంది. ఫినిషింగ్‌నుబట్టి అది ఏదో విదేశీ తయారై వుండాలనుకొంది.

"కానీ త్వరగా డ్రస్ చేసుకో!" మందు గుండు నింపుతూ హెచ్చరించాడు.

"రివాల్వరు ఎందుకు?"

"నా డబ్బునుండి నన్ను నేను కాపాడుకు నేందుకు. ఇది ఎప్పుడూ నాతో వుంటుంది."

"ఎవరన్నా మిమ్మల్ని చంపుతారని భయంగా వుందా?"

"భయంకాదు! అనుమానం."

"అయినా వాళ్లు మిమ్మల్ని చంపుతారనుకోను. మీ డబ్బు కావలసినవాళ్లు అలాంటి పని చేస్తారా?"

"ఇంత పెద్ద పథకం వేసినవాళ్లు ఎంతకయినా తెగించే వుంటారు" అన్నాడు సింగామియా.

"ఎందుకనో నా కలాగనిపించడంలేదు! వాళ్ళ దగ్గర స్టాఫు లేకుంటే రేపు మీకేం చూపిస్తారు? ఆ తర్వాత ఏం పంపుతారు? బ్యాంకు వాళ్ళ దగ్గర డబ్బెలా తీసుకొంటారు? మీరే ఏదో పొరబడి వుండాలనిపిస్తోంది." అంది రోజా.

"మద్రాసులోనే పెరిగాను నేను. వాళ్లు చెప్పే కంపెనీలోనే కూలీగా చేరి మానేజర్నయినాను. ఇప్పుడు దాని ఓనరయిన సుందరేశన్‌ను నేను పెంచాను. వాళ్ళ దగ్గరున్న స్టాకంతా ఎప్పుడో కొనేశాను. ఇన్ని తెలిసి కూడా వాళ్ళను అనుమానించటం తప్పంటావా?" అడిగాడు సింగామియా.

రోజాకు మరి నోట మాటరాలేదు.

సుందర్ తనతో ఈ ప్లాను గురించి చాలాసార్లు చర్చించాడు. అతను చెప్పేది విన్నప్పుడు ఎంత సులభంగా మనిషి డబ్బు సంపాదించగలడో అర్థమయింది. అప్పుడప్పుడూ తనుకూడా కొన్ని ఉచిత సలహాలిచ్చింది. చాలా బాగున్నాయన్నాడు సుందర్.

అంత గొప్పగా, కట్టుదిట్టంగా, ఊహించి వేసిన ప్లాను పేకమేడల్లా తన కళ్ళముందే కూలిపోతుంటే ఆమెకు వింతగాను, విచిత్రంగాను, భయంగాను, అనిపించసాగింది.

గబగబ బట్టలు మార్చుకుంది. గ్రే కలర్ సారీ కట్టుకుని, అదే రంగు జాకెట్ తొడుక్కుంది. లావుపాటి కొప్పు వచ్చేలా హెయిర్ స్టయిల్ మార్చుకుంది. నుదుట చిన్న తిలకం బొట్టు పెట్టింది. సాండిల్స్ తొడుక్కుని, హాండ్ బాగ్ అందుకొంది.

"రోజా!" టై కట్టుకుంటూ పిలిచాడు సింగామియా.

వెళ్ళి దగ్గరగా నిలబడింది.

"ఇది నీ దగ్గర వుంచు. నాకు వాళ్ళవల్ల ప్రమాదముంటుందని ఊహించిన మరుక్షణం దీనితో నీకు ఇష్టమైనంతమందిని చీల్చి చంపు. ఏం భయంలేదు. ఆ తర్వాత గొడవలన్నీ నేను చూసుకుంటాను. సరేనా?" అడిగాడు సింగామియా.

"నాకు భయమండీ!"

"నే నున్నాగా? ధయిర్యంగా కాల్చు!"

కాల్చనంటే తన్ను కూడా అనుమానిస్తాడేమో నన్న ఊహతో "అలాగే!" అంది. రివాల్వరు అందుకొని బ్యాగ్ లోకి తోసింది.

బాండ్ కేస్ చేత్తో పట్టుకుని సింగామియా ముందు గది దాటాడు. ఆ తర్వాత రోజా వచ్చింది. తలుపులకు తాళం వేసి, కీ రింగు కోటులో వేసుకున్నాడు.

"మీ వెంట రావడం ఎవరన్నా చూస్తే బాగుండదేమో?" అంది రోజా.

ఆ మాటలు వినిపించుకోకుండానే ఎలివేటరువేపు నడిచాడు సింగామియా. ఇంక అతన్ని తప్పించుకోవాలనుకుని లాభంలేదని రోజాకూడా వెంట నడిచింది.

కౌంటర్‌లో తాళాలిచ్చి పోర్టికోలో కొచ్చారు.

విమానంలాంటి పొడవుపాటి లేటెస్ట్ మోడల్ ఫోర్డు కారు ఆగివుంది. తెల్లటి యూనిఫాంలో వున్న చప్రాసీ వంగి సలాం చేశాడు. సింగామియా డోర్ తెరచి రోజాను ఎక్కమన్నాడు. ఆమె ఎక్కి ఒక మూలగా వొదిగి కూర్చుంది. అతనుకూడా తలుపు మూశాడు.

లోపలంతా చల్లగా వుంది. మల్లెపూల మత్తెక్కించే వాసన వస్తూంది.

"కారు ఎ. సీ యా?"

"ఆఁ! మన విమానం కూడా ఏ. సి. చేసిందే!" అన్నాడు సింగామియా.

కారు మెత్తగా, వేగంగా కలకత్తా వీధుల్లోని వాహనాల్ని ఈదుకుంటూ పోసాగింది. ఎంత పెద్ద గతుకులోపడ్డా వొళ్లు కదలడంలేదు. రోజాకు స్వర్గం మబ్బులమీద ఎక్కి ప్రయాణం సాగిస్తూన్నట్లుతోచింది.

"మీ ఫ్యామిలీ ఈ వూళ్ళోనే వుందా?" అడిగింది పక్కన.

"నా కెవ్వరూ లేరు! ఒంటరిగాణ్ణి!" అన్నాడు సింగామియా.

అంత డబ్బున్న మనిషికి సంసారంలాంటి దేదీ లేక పోవడం అసహజంగానూ, విచిత్రంగానూ తోచింది. ఆ సంభాషణ కొనసాగించడం ఇష్టంలేక అంతటితో ఆ పేపి విండోగుండా వెలుపలకు చూడసాగింది రోజా.

కారు ఎయిర్ పోర్టు చేరింది.

సింగామియా దిగగానే ఉక్కు దుక్కల్లాంటి ఇద్దరు మనుషులు వచ్చి నిలబడ్డారు.

"అంతా సరిగ్గా వుందా?" అడిగాడు గంభీరంగా.

వాళ్లు సమాధానంగా తలూపారు.

సింగామియా వెంట రోజా నడిచింది.

సుందర్ ఆనంద్ ఎదురొచ్చారు.

సింగామియాకు ఆనంద్‌ను పరిచయం చేశాడు. రోజా వాళ్ళిద్దర్నీ తనకు తెలీనట్లే సన్ గాగుల్స్‌లోంచి ఎయిర్ పోర్టు సర్వే చేయసాగింది. ఆమె మనస్సునిండా సుందర్‌కు జరగబోయే ప్రమాదం గురించే ఆలోచనలున్నాయి.

"మనం ప్లేన్ వద్ద కెళ్దాం!" అన్నాడు సింగామియా.

అందరూ అతన్ని అనుసరించారు. ఒక చిన్న 'డకోటా' దగ్గర ఆగారు. ముచ్చటగా వుంది ప్లేన్. లోనికెక్కారు. మొత్తం 12 సీట్లున్నాయి. నాలుగు సీట్లు విడిగా వున్నాయి. వాటి చుట్టూ కవరింగు వుంది. సింగామియా రోజా ఇద్దరూ ఆ చిన్న కాబిన్‌లోకి వెళ్ళారు. మిగిలిన వాళ్ళంతా తమతమ సీట్లలో సర్దుకున్నారు. విమానం బయలుదేరింది.

5

"వాళ్ళిద్దరూ జీవితంలో ఇలాంటి ప్లేన్ ఎక్కి వుంటారనుకోను!" అన్నాడు సింగామియా, రోజాను చేత్తో అదుముతూ.

"వాళ్ళ సంగతి నాకు తెలియదుకాని, నావరకు నేను విమానం ఎక్కడం ఇదే మొదటిసారి" అంది రోజా.

"ఎలా వుంది?"

"వండర్ ఫుల్ గా వుంది!"

"నాతో వుంటావా?"

"ఆఁ! అంతకన్నా ఈ జీవితానికి మరో మంచిదారి ఏముంటుంది?"

"గుడ్! అలావుండాలి" అన్నాడు సింగామియా.

విమానం జోరుగా పోతూంది. అందరూ మౌనంగా కూర్చున్నారు. సుందర్ కు హుషారుగావుంది. ఆనంద్ కు ఆనందం పట్టపగ్గాలు లేకుండా వుంది. డబ్బు వుండటంలో గల గొప్ప సింగామియాను చూడగానే అతనికి అర్థమయింది.

గంటసేపయింది విమానం బయలుదేరి.

"ఆరొందల కిలోమీటర్ల దూరం వచ్చాం. అంటే దాదాపు విశాఖపట్నం ప్రాంతంలో వున్నాం!" అన్నాడు సింగామియా.

ప్రక్కనున్న ఫోన్ బజ్జర్ మ్రోగింది. రిసీవరు తీసుకొని "హల్లో!" అన్నాడు.

"బాస్! మనం దారితప్పినట్లున్నాం!" అన్నాడు పైలట్.

"వాట్! నాన్సెన్స్! నిజంగానా!" అడిగాడు.

"అవును బాస్! విశాఖపట్నం ఎయిరోడ్రోంను కాంటాక్టు చెయ్యలేకపోతున్నాను. ఏయాంగిల్ లో పోతున్నదీ కూడా తెలియలేదు. ఆ ఇండికేటర్ చెడిపోయినట్లుంది. దానివల్లే దారితప్పాను" అన్నాడు మళ్ళా.

"గ్యాస్ నిండా వుందా?"

"వుంది!"

"ఎన్ని కిలోమీటర్లు పోగలం!"

"రెండు వేలు!"

"అయితే పోనీ, మధ్యలో ఏదైనా ఎయిర్‌డ్రోం దొరుకుతుందా చూడు. కాంటాక్టు చిక్కగానే దిగేసెయ్. అర్థమయిందా?" అడిగాడు సింగామియా.

"అర్థమయింది బాస్!" అన్నాడు అవతలవేపునుండి పైలట్.

సింగామియా ఫోన్ క్రింద పెట్టాడు. మనస్సు చెడిపోయింది. చాలా పెద్ద ప్రమాదంలో తను చిక్కుకుపోయినట్లు తెలుసుకున్నాడు.

రోజాకు పరిస్థితి పూర్తిగా అర్థంగాకున్నా, చూచాయగా కొంత తెలిసింది. బెంబేలుపడిపోయింది.

"ఏమయిందట?" అడిగింది మెల్లగా.

"ఏంలేదు! విమానం దారి తప్పింది. ఎటు పోతూందో తెలియటంలేదు."

"ప్రమాదమా!"

"ప్లేన్‌లోవున్న గ్యాస్ అయిపోయేలోగా ఎక్కడైనా దిగిపోవాలి! లేకుంటే అందరం గాల్లోనే మాడిపోతాం!"

"అంతేనా?" అంటూ భోరుమని ఏడ్చింది. క్షణం ముందు కన్న రంగుల కలలన్నీ చెదిరిపోయాయి. ఇప్పుడు ప్రాణాలు నిలుపుకోవడమెలాగానన్న ఆలోచన మాత్రమే మిగిలింది.

"ఈ సంగతి అందరికీ చెప్దామా?"

"వద్దు!"

"ఏం!"

"భయపడి గల్లంతుపడతారు. మన పైలట్ చాలా తెలివిగలవాడు. ఇంతకన్నా గడ్డు సమస్యల్ని ధైర్యంతో ఎదుర్కొన్నాడు. నన్ను చాలాసార్లు కాపాడాడు. అతనే ఏదో ఒకదారి చూస్తాడు. నువ్వు నిర్భయంగా వుండు. చావే తప్పదనుకుంటే ముందు నేను ఛస్తాను. ఆ తర్వాతే నువ్వు" అన్నాడు సింగామియా.

అతని మాటలతో రోజాకు కొంత ధైర్యం కలిగింది.

మరో అరగంట గడిచింది.

సింగామియా ఫోనో రెండు నిమిషాలు పైలట్‌తో మాట్లాడాడు. రోజావేపు తిరిగి "ఇంకా అతనికి సరైన రూటు చిక్కలేదుట!" అన్నాడు.

మాట్లాడకుండా కూర్చుంది రోజా.

సింగామియా సిగరెట్ వెలిగించుకొని లేచాడు. కాక్‌పిట్ వైపుకు వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన రెండు నిముషాలకు సుందర్ కాబిన్ ద్వారం దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

"అతను ఎందుకు వెళ్ళాడు?"

"తెలీదు!" అంది రోజా.

"మన ప్లాన్ గురించి ఏమన్నా పసిగట్టాడా?"

"మనం అంటే... ఎవరు? నువ్వెవ్వరు? ఎందుకిలా వచ్చావ్?" అడిగింది రోజా.

"అప్పుడే నన్ను మరచిపోయావా? గాలానికి గుచ్చి ఎరలా వేశాను నిన్ను చేపను పట్టుకోనేందుకు. నువ్వు గాలాన్ని వదలి చేపనోట్లో దూరావా?" అడిగాడు అక్కసుతో సుందర్.

"అనవసరంగా మాట్లాడకు! నోర్మూసుకుని వెళ్ళి కూర్చో" అంది ధైర్యంగా.

ఆ మాటనగానే అతని వెనుకనున్న ఇద్దరూవచ్చి

సుందర్‌ని పట్టుకుని లాక్కుపోయారు. కాబిన్‌లోంచి గమనించి చూడసాగింది. అతని వెంటవున్న ఆనంద్ ఏదో సర్దిచెప్పాడు. దాంతో అక్కడ సద్దు మణిగింది.

మరో అరగంట గడిచింది. కాక్‌పిట్ వైపునుండి తూలుతూ వచ్చాడు సింగామియా.

"డియర్ ఫ్రెండ్స్! మనం పెద్ద ఆపదలో చిక్కుకున్నాం. మన పైలట్ దారితప్పాడు. మరేదారిని పట్టుకోలేకపోయాడు. మరో పదిహేను నిముషాల్లో మన విమానంలోవున్న గ్యాస్ అయిపోతుంది. వెంటనే అది భూమ్మీని కూలిపోతుంది. మీమీ శక్తియుక్తుల్ని అనుసరించి మీమీ ప్రాణాలు పోగొట్టుకోకుండా తప్పించుకునేందుకు దారులు వెతుక్కోండి!" అన్నాడు సింగామియా.

అందరూ అప్రతిభులై లేచి నిలుచున్నారు.

"కావాలని మమ్మల్ని ఆపదలో పడేశావ్!" అన్నాడు సుందర్.

"షటప్! మీ ఇద్దరూ అదృష్టవంతులు. మిమ్మల్ని శ్రీకృష్ణ జన్మస్థానంలో జీవితాంతం పడేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాను. ఈ ప్రమాదం ముంచుకొచ్చి కనీసం చచ్చేందుకన్నా అవకాశం కల్పించినవాణ్ణయినాను. మీ అసలు బ్రతుకు నాకు తెలుసు. మీ ప్లాన్లు నాకు తెలుసు" అన్నాడు సింగామియా.

ఆనంద్ సుందర్‌కేసి కోపంగా చూశాడు.

సుందర్ తలదించుకున్నాడు.

"మనం ఎవ్వరం బహుశా బ్రతకం. మనం సముద్ర మట్టానికి ఆరువేల అడుగుల ఎత్తునున్నాం. అక్కడ్నుంచి విమానం కూలిపోవడమంటే మొత్తం పొడిపొడిగా

మారటమే! చేసిన తప్పులకు మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం ప్రకటించుకోండి. భగవంతుణ్ణి తలచుకోండి! చావుకు సన్నద్ధులు కండి!" అంటూ కాబిన్‌లోకి వచ్చాడు.

అతని మాటలన్నీ విన్న రోజా ఏడుస్తూ అతనిపైన పడింది.

సింగామియా ఆమెను లాలించాడు. ధైర్యం చెప్పాడు. చచ్చేందుకు కావలసిన ఆత్మస్థయిర్యం చేకూర్చుకోనేందుకు వలసిన చేయూత నందించాడు.

ఎర్రలైటు వెలిగింది.

విమానం రయ్యిమని కూలిపోసాగింది. సెకండుకు వందల అడుగుల చొప్పున క్రిందకి, తోక తెగిన చుక్కలా రివ్వుమని గాలిని చీల్చుకుంటూ, చీకటిని కోసుకుంటూ రాలిపోసాగింది.

అందరూ గుడ్లు తేలవేశారు.

చెవులు చిల్లులు పడేట్లు భీకరమైన శబ్దం వినిపించింది. ఆ తర్వాత ఏం జరిగిందీ ఎవ్వరికీ తెలీలేదు.

6

వీపులోంచి రక్తం కారుతున్నట్లు దేంతోనే కోస్తున్నట్లు అనిపించింది రోజాకు. కళ్ళు తెరచే ప్రయత్నం చేసింది. కానీ రెప్పలు విడివడలేదు. బలవంతంగా బరువునంతా భుజాలపై తోసి వెల్లికింతలా తిరిగింది.

సూర్యుడి వేడికిరణాలు రెప్పలకి తగిలి మండాయి. కళ్లు తెరచుకున్నాయి. చూసింది రోజా. ఆకాశం, అందులో కణకణ మండుతున్న ఎండగుండా కనుపించినా చూడలేని తెల్లటి సూర్యబింబం.

మెల్లగా లేచి కూచుంది. పది గజాల దూరంలో విమానం ముక్కముక్కలయి కనుపించింది. తనో పెద్ద

కొండరాయిపైన పడుంది. చుట్టూ ఎటుచూసినా పెద్ద పెద్ద చెట్లు కనిపించాయి. ఖండల అడుగుల లోతున లోయలున్నాయి. మోచేతికిపైన కుడిచెయ్యి తెగి రక్తం కారుతూంది. చీరతో తుడుచుకుంది. మెల్లగా కాళ్ళలోకి శక్తి తెచ్చుకొని లేచి అటూ ఇటూ చూసింది. విమానం చుట్టు, అందులో ప్రయాణించిన వాళ్ళు పడున్నారు. పైలట్ కాలిపోయి నల్లటి తారులా మాడిపోయాడు.

సుందర్, ఆనంద్ ప్రక్క ప్రక్కనే పడివున్నారు. వాళ్ళ చేతుల్ని తీసుకొని చూసింది. నాడి కొట్టుకుంటున్నట్లనిపించింది. సింగామియా బోరగింతలా పడివున్నాడు. వెళ్ళి అతన్ని వెల్లకిలా త్రిప్పింది. నుదుటపైన పెద్ద గాయమై రక్తం కారుతూంది. స్పృహ లేకుండా పడి వున్నాడు. అతని అనుచరులిద్దరూ విమానం ఫ్రేములో ఇరుక్కుపోయి చచ్చారు.

ఎక్కడైనా నీళ్ళు దొరుకుతాయేమోనని చుట్టూ చూసింది. కనుచూపు మేరలో ఎక్కడా ఏమీ కనుపించ లేదు.

దూరంగా పడివున్న బాండ్ కేస్ దగ్గర కెళ్ళి చూసింది. అది ఆమెకు బాగా గుర్తే! దాన్ని సింగామియా తీసుకొచ్చాడు. తెరచి చూసింది. అందులో బ్రాందీ బాటిల్స్, సిగరెట్ పెట్టెలు, అగ్గిపెట్టెలు కొంత కరెన్సీ వున్నాయి. ఒక బాటిల్ ఓపెన్ చేసి, ముగ్గురి మొహాలపైన కొద్దికొద్దిగా చిలకరించింది. మిగిలింది తను త్రాగింది.

ముగ్గురూ గాఢనిద్రలోంచి మేలుకొన్నట్లుగా లేచి కూర్చున్నారు. జరిగిన ఘోరం చూడగానే మతులు పోయాయి.

సింగామియా కడితాలు పైకెత్తలేక పోయాడు. అల్యూమినియం ముక్కేదో అతని కాలి కండరంలో దూరినట్లుందని చెప్పాడు.

"ఇదేం ప్రాంతం?" సుందర్ అడిగాడు.

"నాకేం తెలుసు?" అంది రోజా.

"నీకు తెలుసా?" సింగామియాను చూసి అదే ప్రశ్న వేశాడు.

"తెలీదు!"

"ముమ్మల్నేదో చెయ్యాలనుకున్నావ్! ఇప్పుడు చూశావా? లేచి కూర్చోలేకున్నావ్?" అన్నాడు సుందర్ అవహేళనగా.

సింగామియా మాట్లాడకుండా తలవంచుకున్నాడు. ఆనంద్ కాళ్లు చేతులు సర్దుకుని మెల్లగా లేచి వొళ్ళు విరుచుకున్నాడు.

రోజా బాండ్ కేస్ చూసి పట్టుకుంది వాళ్ళకు కాస్త దూరంలో.

"ఈ అడవిలో అన్నిరకాల మృగాలున్నట్లున్నాయి. నీ పెట్టెలో రివాల్వరు ఏదైనా వుందా?" అడిగాడు ఆనంద్.

"లేదు!" అంది రోజా.

"ఏముంది దానిలో?"

"డబ్బు, బ్రాందీ సీసాలు" చెప్పింది రోజా.

"సరేలే. వెళ్దాం పద మనం" అన్నాడు సుందర్.

"ఎక్కడికి?"

"నడిస్తేగానీ తెలీదు. ఇక్కడుంటే ఇంకో రోజులో ఛస్తాం. ముందుకుపోతే బ్రతికే అవకాశం దొరకొచ్చుగా?"

"నన్ను కూడా తీసుకుపోండి!" అన్నాడు సింగా మియా.

"నో! నీ సంగతి మాకు అవసరంలేదు. మమ్మల్ని జైల్లో పెట్టాలనుకున్నావ్. అలాంటి నిన్ను రక్షించడం మహాపాపం. నువ్వు ఇక్కడే ఏ క్రూరమృగం వాతనో పడి చావాలి! రోజా! రా! వెళ్దాం!" అన్నాడు సుందర్.

"అది అన్యాయం! అతన్ని ఆపదల్లో వదిలేసి వెళ్ళడం తప్పు. అతన్ని మనతో తీసుకుపోదాం! బ్రతికినా చచ్చినా ఒకటిగానే..." అంది రోజా.

"వీల్లేదు! అతన్ని నమ్ముకుని వుండదలచుకుంటే వుండిపో. మేము వెళ్తాం!" అన్నాడు ఆనంద్.

సింగామియా భయంగా అందరికేసి చూశాడు. రోజా అతనికేసి చూసింది. ఆమె కళ్ళల్లోకి దీనంగా చూశాడు. ఆమె గుండె ద్రవించింది. మెల్లగా వచ్చి అతనిప్రక్కన కూర్చుంది.

"నీకేం భయంలేదు! నేనున్నాను. చచ్చినా నీతో నే ఛస్తాను" అంది రోజా.

"రోజా! నువ్వు... నువ్వు... దేవతవు!" అన్నాడు కళ్ళు చెమర్చుకుంటూ.

సుందర్, ఆనంద్ ముందుకు కదిలారు.

రోజా సుందర్‌ను పిలిచింది.

"ఏం కావాలి?" అడిగాడు సుందర్.

"డబ్బుకోసం ఎంత నీచానికైనా పాల్పడగలవు నువ్వు. నన్నూ, సింగామియాను సురక్షితంగా ఏదైనా ఊరు చేర్చు. నీ సంగతి పట్టించుకోవడం మానేస్తాం! అందుకు ప్రతిఫలంగా పాతిక వేలు అడ్వాన్సుగా ఇస్తాను. ఊరు చేరాక రెండు లక్షలిస్తాను" అంది రోజా.

"అఖర్లేదు!" అన్నాడు సుందర్.

"అలా కాదు! తన ఆస్తిలో సగం రాసిస్తాడేమో అడుగు. అతన్ని మోసుకొని పోతాను" అన్నాడు ఆనంద్.

"ఇస్తాను" అన్నాడు సింగామియా.

సుందర్, ఆనంద్‌ను వారించాడు. కానీ ఆనంద్ వినకుండా వెనక్కి వచ్చాడు. రోజా, ఆనంద్ కలిసి సింగామియాను లేవదీశారు. అతను రెండు చేతుల్నూ ఇద్దరి భుజాలపైన వేసి కుంటుకుంటూ నడవసాగాడు.

వాళ్ళున్నది ఎత్తైన పెద్ద బండలాంటి కొండ. అక్కడ్నుంచి క్రిందికి దిగేందుకు సరైన మార్గం లేదు. కొండల్ని ఎక్కాలన్న ప్రయత్నంతో వచ్చేవాళ్ళ దగ్గరయితే రకరకాల పనిముట్లు ఉంటాయి. ప్రమాదంలో చిక్కుకుని అక్కడ చిక్కుకున్న వాళ్ళు కావటంవల్ల, ఏ విధమైన పనిముట్లు వాళ్ళ దగ్గర లేవు. కొండ భాగం ఒకవైపు చక్కగా చెక్కినట్లు నున్నగా వుంది. దాదాపు ముప్ఫయి అడుగుల క్రిందకు దిగితే కాస్త భూమి కనిపిస్తుంది. అక్కడ్నుంచి దూకితే కాళ్ళు విరుగుతాయి.

సుందర్ అక్కడే నిలుచుని చాలాసేపు చూశాడు. దూకుదామని రెండు మూడుసార్లు ప్రయత్నించాడు. కానీ కాళ్ళు రెండుగా విరుగుతాయన్న భయంతో ఆ ప్రయత్నాన్ని మానుకున్నాడు.

అంతలోనే ఆనంద్, రోజా, సింగామియా అక్కడకు చేరారు.

"ఏం? ఇక్కడ ఆగావేం?" అడిగింది రోజా.

ముప్ఫయి అడుగుల క్రిందున్న నేలను చూపించాడు సమాధానంగా.

"దూకలేకపోయావా?" అడిగింది కోపంగా.

సుందర్ సమాధానం చెప్పకుండా నిలుచున్నాడు.

సింగామియా, ఆనంద్ కొన్నిక్షణాలు తర్జన భర్జన చేశారు. కానీ ఏ విధమైన మార్గము తోచలేదు.

"ఒక పనిచేస్తే" అన్నాడు ఆనంద్.

"ఏమిటీ?" అడిగింది రోజా.

"నీ చీర దాదాపు ఐదున్నర మీటర్లుంది. అంటే దాదాపు పదిహేడు అడుగులుండన్నమాట. దాన్ని రాయికి కడదాం ఒక్కొక్కరం దాన్ని ఆధారంగా జారిపోదాం. పోతే పదమూడు అడుగులు మాత్రమే మిగులుంది. అది దూకేయచ్చు. పెద్దగా దెబ్బలు తగలక పోవచ్చు. ఆ పట్టు వదిలేప్పుడు ఒంట్లోవున్న బరువంతా భుజాల్లోకి తెచ్చుకోగలిగితే చాలు" అన్నాడు.

"వండర్‌ఫుల్. నీ ఐడియా బావుంది!" అన్నాడు సుందర్.

"నీ కనవసరం!" కోపంగా అన్నాడు ఆనంద్.

వెంటనే రోజా చీర విప్పేసింది. ఆనంద్ దాన్ని రాయికి కట్టాడు. ముందు ఆనంద్, తర్వాత సింగామియా, ఆపైన రోజా జారారు. క్రిందకు దూకిన ఆనంద్, సింగామియా రోజా చీరపట్టు వదలగానే నేలమీద పడకుండా తమ చేతుల్తో పట్టుకున్నారు. ఆఖరున సుందర్ కూడా దాని సాయంతోనే దిగాడు.

నలుగురూ అడవిలో పడ్డారు.

కీచురాళ్ళు రొదచేస్తున్నాయి. సరైన దోవేది కనుపించలేదు. గుడ్డి ఎద్దుల్లా నడిక సాగించారు. అందరికీ నాలుక పిడచకట్టుకుపోతూంది. తాగేందుకు నీళ్ళుగానీ, తినేందుకు తిండిగానీ కనుపించలేదు. చెట్లకేసి చూశారు,

అన్నీ పేడు మొక్కలు, ముళ్ళపొదలు. నాలుగైదు మైళ్ళు నడిచారు.

సింగామియా కాలునొప్పి ఎక్కువగా వుందన్నాడు. ఆనంద్ కాసేపువిశ్రాంతి తీసుకుందామనిసూచించాడు. రోజా సరేనంటూ చతికిలపడిందో చెట్టు మొదట్లో.

బాండ్ కేస్ లోంచి బ్రాందీబాటల్ తీసి తను కాస్త తాగి, కాస్త సింగామియాను తాగమంది. సింగామియా కొద్దిగా తాగి ఆనంద్ కిచ్చాడు. ఆనంద్ బాటిల్ ఖాళీ చేశాడు. దానికేసి ఆత్రంగా చూడసాగాడు సుందర్. అతనికి దాహం ఎక్కువగావుంది.

"రోజా!" పిలిచాడు సింగామియా.

"ఏమిటి?" అడిగింది.

"అతనికూడా కాస్త ఇవ్వు!" అన్నాడు.

"వద్దులెండి!" అంది కోపంగా.

"తప్పు! మనమంతా చావు బ్రతుకుల మధ్య కొట్టుకుంటున్నాం. మనలాగే అతనికీ దాహం వుండివుంటుంది. బహుశా అడిగేందుకు జంకుతున్నాడు. కాస్త ఇవ్వు రోజా!" అన్నాడు సింగామియా.

ఇంకో బాటల్ తీసి సుందర్ కిచ్చి కొద్దిగా తాగి మిగిలింది ఇవ్వమని చెప్పింది. సుందర్ సగం బాటల్ ఖాళీచేసి మిగిలింది ఇచ్చాడు.

సింగామియా బాండ్ కేస్ పైన తలపెట్టుకుని పడుకున్నాడు.

విపరీతమైన చలి పుట్టుకరాసాగింది. వొణికిపోవడం మొదలెట్టాడు. ఆనంద్ సింగామియా వొళ్ళు చూశాడు. కాలిపోతున్నట్లుంది.

"బాగా జ్వరం తగిలింది రోజా!" అన్నాడు.

"ఆ గాయాలు నొప్పి చేసి వుంటాయి" అంది రోజా.

"చస్తారేమో! ఆ స్త్రీ మనకన్నా రానీ పారెయ్యమను" అన్నాడు సుందర్.

"నోర్ముయ్యి! ఇరవై నాలుగు గంటలూ డబ్బుతప్ప మరో ధ్యాస లేదు నీకు. రానిస్తే మాత్రం ఏం చేస్తావ్. నువ్వు మాత్రం ఈ దారి తెలియని అడవిలోంచి ఏ పులి నోట్లోనో పడకుండా క్షేమంగా బయటపడగలవని గ్యారంటీ వుందా!" అంది రోజా కోపంగా.

ఆనంద్ కోటువిప్పి కప్పాడు సింగామియాకు.

రోజా సిగరెట్ అంటించి, అతని నోట్లో పెట్టి రెండు దమ్ములు లాగమంది. సింగామియా బలవంతంగా సిగరెట్ త్రాగాడు. దగ్గొచ్చింది. లాభంలేదని సిగరెట్ పారేశాడు.

"మన విమానం కూలిపోయిన విషయం ప్రభుత్వానికి తెలిసి వుంటుంది. మనకోసం బహుశా వాళ్ళు వెతుకుతూ వుండవచ్చు. మనం అక్కడే వుండి వుండవలసింది" అన్నాడు ఆనంద్.

"లాభంలేదు! కలకత్తా వదలగా మన విమానానికి కంట్రోలుతో కనెక్షను పోయింది. ఎటుపోయి వుంటుందో ఊహించడం సాధ్యంకాదు వాళ్ళకు. మెల్లగా మనమే ఈ అడవినుంచి బైటపడాలి!" అన్నాడు సుందర్, అతన్ని వాళ్లు అభిప్రాయం అడగకున్నా.

7

సింగామియాకు వొణుకు తగ్గింది. మెల్లగా నిద్రలోకి జారాడు. అతన్ని ఆనుకుని రోజా పడుకుంది. తనరూపం తనకే విచిత్రంగావుంది. చీర కాస్తాపోయింది. పెట్టీకోట్ మాత్రం మిగిలింది. జాకెట్ వేసుకునుంది. తలంతా రేగిపోయివుంది.

"రోజా!" పిలిచాడు ఆనంద్.

"ఏమిటి?"

"నేను అలా వెళ్ళి తినేందుకేమయినా పండ్లలాంటివి ఏవన్నా దొరుకుతాయేమో చూస్తాను. నువ్వు అతన్ని కనిపెట్టుకుని వుంటావా?" అడిగాడు.

"ఊఁ!" అంది.

ఆనంద్ లేచి, సుందర్‌ని వెంటరమ్మన్నాడు. తన కాకలిగా లేదని రానన్నాడు. ఆనంద్ వెళ్ళిపోయాడు. అతను కనుమరుగుకాగానే సుందర్ లేచి రోజాదగ్గర కొచ్చి కూర్చున్నాడు.

"ఏం మళ్ళీ దగ్గరకొచ్చావ్?" అడిగింది రోజా.

"ఆ వెధవ వాడిచావు వాడు చస్తాడు. నువ్వురా. మనిద్దరం వెళ్ళిపోదాం" అన్నాడు.

"మళ్ళా ఆ మాటన్నావంటే కాల్చిపారేస్తాను" అంది రోజా.

"నువ్వు రాకుంటే నీ ఖర్మ! ముందొచ్చిన చెవులకన్నా వెనకొచ్చిన కొమ్ములువాడి అన్న విషయం అర్థమయ్యేట్లు చేశావ్. సంతోషమే! కనీసం ఆ బాండ్ కేస్ పడెయ్యి. నా తోవన నేను వెళ్ళిపోతాను" అన్నాడు సుందర్.

"ఇవ్వను" అంది రోజా.

"మర్యాదగా ఇస్తేసరే! లేకుంటే బలవంతంగానైనా పీక్కుపోతాను" అన్నాడు సుందర్.

"నువ్వు మనిషివికాదు!"

"అది ఋజువుచేద్దామనే నా బాధంతా!" అంటూ సింగామియా తలక్రిందున్న బాండ్ కేస్ పైన చెయ్యి వేశాడు.

"మర్యాదగా చెయ్యితియ్! లేకుంటే ఏం చేస్తానో

నాకే తెలీదు!'' అంది రోజా.

''నువ్వేం చేస్తావో నాకు తెలుసు. అలవాటు ప్రకారం మిగిలిన బట్టలుకూడా విప్పి డాన్స్ చేస్తావ్! అంతే!'' అంటూ కేస్ బలంగా లాగాడు. అది అతని చేతుల్లోకి వచ్చింది. సింగామియాకు మెలకువొచ్చింది. జరిగింది తెలుసుకో నేందుకు ఎక్కువసేపు పట్టలేదు. లేచి కూర్చు న్నాడు.

తన హాండ్ బ్యాగ్ పోయినందుకు బాధపడింది రోజా! అదే వుండివుంటే సుందర్ ని రివాల్వరులో కాల్చి చంపివుండేది.

''సుందర్! ఆ కేస్ ఇలా ఇవ్వు!'' అన్నాడు కోపంగా కూర్చునే.

''ఇవ్వను'' అన్నాడు సుందర్.

''మర్యాదగా చెప్తున్నాను ఇచ్చెయ్యి. లేకుంటే...'' అంటూ చెయ్యి పాంటు జేబులో పెట్టాడు.

''ఏంచేస్తావ్ రా పందీ! నన్నూ ఆనంద్ ను జైల్లో తోద్దామనుకున్నావు! అందుకే నీకీ శిక్ష!'' అన్నాడు ముందుకు కదుల్తూ.

''చేతులెత్తు!'' అరిచాడు సింగామియా.

సుందర్ వెనక్కి తిరిగి చూశాడు.

చిన్న రివాల్వరు సింగామియా చేతుల్ని అలంకరిం చింది.

''అందులో గుండ్లున్నాయా!'' అనుమానంగా అడు గుతూ చేతులు పైకెత్తి నిలుచున్నాడు.

''అనుమానంగా వుందా?'' అంటూ గాల్లోకి పేల్చాడు రివాల్వరు సింగామియా.

బ్రాండ్ కేస్ విసిరి పడేశాడు. అదొచ్చి రోజాదగ్గర

పడింది. వెనకనుంచి వచ్చిన ఆనంద్ జరుగుతున్న గొడవ చూసి తిన్నగా సుందర్ దగ్గరకొచ్చి చాచి లెంపకాయ కొట్టాడు. తల దిమ్మదిరిగి క్రిందపడ్డాడు సుందర్.

"నువ్వటు వెళ్ళగానే అతను చేసిందిది!" అంది రోజా.

"ఫరవాలేదు! నేను వెతికి వచ్చాను. ఒక ఫర్లాంగు దూరంలో చిన్న నీళ్ళగుంట వుంది. చాలా మడ్డిగా వున్నాయి నీళ్లు. అయినా త్రాగవచ్చు, ఫరవాలేదు. నేను కాస్త త్రాగాను. బాగానే వున్నాయి" అన్నాడు ఆనంద్.

"అయితే వెళ్దాం!" అంది రోజా. అంతా ఆనంద్‌ను అనుసరించారు. సుందర్‌ను ఎవ్వరూ పట్టించుకోలేదు. అయినా వాళ్ళ వెంట నడవడం మొదలెట్టాడు. చెట్లను, తీగల్ను తప్పుకొంటూ నడిచారు. వందడుగుల వ్యాసంలో వున్న చిన్న నీళ్ళగుంట కనుపించింది.

అందరూ అక్కడ మొఖాలు కడుక్కొని, కడుపు నిండా నీళ్లు త్రాగారు. పోయిన ప్రాణాలు సగం లేచి వచ్చినట్లయింది. వచ్చి గట్టుమీదవున్న పెద్ద టేకు చెట్టు క్రింద కూర్చున్నారు.

"తినేందుకేమీ దొరకేటట్లు లేదు!" అంది రోజా.

"వెతికి చేశాను. ఏ విధమైన పండ్ల చెట్లూ లేవు. అన్నీ టేకు చెట్లే!" అన్నాడు.

"అయితే మనం మధ్య ప్రదేశ్ అడవుల్లో వుంది వుండాలి. దేశంలోవున్న అన్ని అడవుల్లోకీ, అక్కడే టేకు చెట్లు అధికంగా వున్నాయి" అన్నాడు సింగామియా.

"అయితే ఈ అడవుల్లో నేకదూ బందిపోటు దొంగలు విపరీతంగా తిరిగేది!" అంది రోజా భయంగా.

"అవును! తలలు ఊచకోతకోసే దుర్మార్గులుండే దిక్కదే!" అన్నాడు సింగామియా.

సుందర్ కు పై ఊపిరి పైనేపోయింది. అబద్ధాలు చెప్పి, మనుష్యుల్ని మోసంచేసి డబ్బు సంపాదించడం అతని వృత్తి. అతనికి దొంగలు, హంతకులు, హత్యలులాంటి వంటే చచ్చేంత భయం.

"అనవసరంగా చంపుతారా?"

"ఆఁ!"

"మనదగ్గరేమీ లేదుగా! ఎందుకు చంపుతారు?"

"ఏమిలేనందుకే! ఏమన్నావుంటే తీసుకుని, తమ రహస్యాలు పోలీసులకు చెపుతారేమోనని చంపేస్తారు" అన్నాడు సింగామియా.

"అంటే చావు ఎటూ తప్పదన్నమాట."

"వాళ్ళ కళ్ళల్లో పడితే అంతే!" అన్నాడు సింగామియా.

8

అందరికీ ఆకలి ఎక్కువయింది. పేగులు అరుస్తున్నాయి. ఒకర్నొకరు అలవయితే తినేట్లుగా వున్నారు.

"మనం ఇక్కడ ఇలా కూర్చుని లాభంలేదు. ముందుకు పోదాం! బ్రతికి బైటపడే మార్గమేదన్నా కనిపించవచ్చు" అన్నాడు ఆనంద్.

"అలాగే! నడుద్దాం పదండి!" అన్నాడు.

రోజా లేచింది. రెక్కపట్టుకుని సింగామియాని లేపింది. ఆనంద్ రెండో రెక్క తన భుజంపైన వేసుకొన్నాడు. ఇద్దరి భుజాలపైన బరువువేసి ఈడ్చుకుంటూ నడవటం మొదలెట్టాడు సింగామియా.

ఒక మైలు నడిచారు. ఆ బాటంతా ముళ్ళమయం.

అందులో కుడివేపు పెద్ద లోయ. ఎడంవైపు ఎత్తైన కొండ. ఏ మాత్రం కాలుజారినా ఎముకలు పిండయి పోతాయి అక్కడినుంచి లోయలో పడితే. అలాగే నడిచారు అందరూ. త్రోవలో తినేందుకు పనికొచ్చే వస్తువేది కంటబడలేదు ఎవ్వరికీ.

లోయలోంచి దూరంగా తెల్లటి పొగ ఆకాశంలోకి వుండలు చుట్టుకుంటూ పైకిలేవడం కనిపించింది రోజాకు. అది సింగామియాకు చూపించింది. అతనుకూడా తదేకంగా చూచి "అవును. మనమెలాగైనా అక్కడకు చేరాలి! అక్కడేదో గూడెం వున్నట్లుంది. మనుషులున్నారు గాబట్టే అలా పొగవస్తూంది" అన్నాడు.

"కానీ అక్కడకు ఎలా వెళ్ళాలి? మనం లోయపైనున్నాం. ముందు ఇక్కడ్నుంచి దిగి లోనికెళ్ళాలి. అక్కడి కెళ్ళాక మనకు ఆ గూడెం ఏవైపు వున్నదీ కనుపించదు. అందువల్ల బహుశా ఆ ప్రాంతానికి చేరడం కష్టమేమో?" అన్నాడు సింగామియా తనే మళ్ళీ.

"అలాని ప్రయత్నం మానేస్తామా! మెల్లగా వెళ్దాం! చావు కానీ, బ్రతుకుగానీ ముందు మనం మనుషుల్లో పడాలి!" అన్నాడు ఆనంద్.

"అది రైటన్నమాట!" వంతపలికాడు సుందర్. "కానీ వాళ్లు బందిపోటు దొంగలైతే త్వరగానే మనల్ని స్వర్గానికి పంపుతారు."

అతని మాటల్ని ముగ్గురూ విననట్లే ముందుకు నడవసాగారు.

ఆనంద్ కీ అనుభవం వింతగావుంది. రోజాకు భయంగా, సింగామియాకు ప్రాణాంతకంగా తయారైంది.

మెల్లగా తీగలు పట్టుకుంటూ, చెట్లవేళ్ళను ఆధారం

చేరుకుంటూ ఒక్కొక్క అడుగే క్రిందికి దిగసాగారు లోయలోకి. ఆ లోయ దాదాపు వెయ్యి అడుగుల లోతున వుంది. వాళ్ళ వెనకగా సుందర్ నడుస్తున్నాడు. అతని కెలాగైనా బాండ్ కేస్ కొట్టెయ్యాలన్న కోరికగావుంది. అందులో లక్షరూపాయలకు తక్కువుండదని తెలుసు. అది చేజిక్కించుకొని, చిన్నగా ఈ అడవిలోంచి బైట పడితే, కాలుమీద కాలేసుకుని దర్జాగా కూర్చుని బ్రతకొచ్చునన్న ఆశ ఎక్కువకాసాగింది. కానీ సింగామియా జేబులోనున్న రివాల్వరు అతన్ని ప్రయత్న విముఖుణ్ణి చేసింది.

దూరంగా ఎక్కడో పులి గాండ్రింపులు వినిపించాయి. అందరూ స్థాణువులై కదలకుండా నిలబడ్డారు.

"దగ్గర్లో ఎక్కడో పులి వున్నట్లుంది. అరుస్తూంది. విన్నారా?" అడిగాడు ఆనంద్.

"ఆఁ! అది పులి అరుపులాగా వుంది" అన్నాడు సింగామియా.

"దానికి నరవాసన తెలుస్తుందటగా?" భయంగా అడిగింది రోజా.

"మనం నలుగురమున్నాం దాన్ని చంపలేమా!" సుందర్ అడిగాడు.

"ముందు నువ్వెళ్ళి దాంతో యుద్ధం చెయ్యి? ఆ తర్వాత మేము సాయం వస్తాం!" వ్యంగ్యంగా చెప్పాడు ఆనంద్.

పులిగాండ్రింపులు బాగా దగ్గరకాసాగాయి.

అందరి ముఖాల్లోనూ భయం క్రమ్ముకొచ్చింది.

"అదుగో ఆ చెట్టెక్కితే మనమంతా!" సూచించాడు సుందర్.

అందరూ గబగబా చెట్టెక్కే ప్రయత్నంలో వున్నారు. సుందర్ ముందెక్కేశాడు. ఆ తర్వాత రోజా ఎక్కింది. ఆ తర్వాత సింగామియాను ఎక్కించేందుకు ఆనంద్ ప్రయత్నం చెయ్యసాగాడు. అతని కాళ్ళల్లో సత్తువ లేకపోవడంవల్ల ఎంత ప్రయత్నంచేసినా సింగామియా వల్లకావడంలేదు. మూడుసార్లు మొదలుదాకా ప్రాకి, పట్టుచిక్కక జారిపోయాడు.

“ఆనంద్! నావల్లకాదు. వస్తే ఆ పులినోట్లో పడన్నా ఛస్తాను. నువ్వెక్కు” అన్నాడు అతన్ని బలిచెయ్యడం ఇష్టంలేక.

“అలాకాదు! చావైనా ఏమైనా ఇద్దరికీ కలిసే వస్తుంది. మళ్ళీ ప్రయత్నించండి!” అన్నాడు ఆనంద్.

కృతజ్ఞతతో సింగామియా కళ్ళు ఆర్ద్రమయినాయి. దొంగయినా అతనిలోని మానవత్వం మేలుకొంది. తోటి మనిషికోసం తన ప్రాణాల్నికూడా ఖాతరు చెయ్యడం లేదతను. తన డబ్బు, హోదా, దర్జా అన్నీ ఎప్పుడో నిరుపయోగమయినాయి. ఇప్పుడు ప్రాణాలు నిలబెట్టుకోవడం కోసం వ్యగ్రప్రయత్నం సాగిస్తున్న మామూలు మనిషి తను.

అంతలోనే పెద్దపులి వచ్చింది. ఏడడుగుల పొడవుంది. పొడవుపాటి నల్లటి చారలో, పసుపుపచ్చ రంగులో వుందది. దానితల పెద్ద సెర్చిలైట్‌లాగుంది. వాసన చూసుకుంటూ, చెట్లలోంచి రావడం కనుపించింది.

“ఆనంద్! వచ్చేసింది” అన్నాడు సింగామియా.

“మీరు ధైర్యంగా వుండండి. ఆ రివాల్వరు నా కివ్వండి” అన్నాడు ఆనంద్.

సింగామియా గబగబా తీసిచ్చాడు.

తలపైకెత్తి రోజానడిగి బాండ్ కేస్ తీసుకున్నాడు. దాన్ని సింగామియాకు అందించి "అందులో ఖాళీ బాటిల్సున్నాయిగా. వెలుపలకుతీసి పట్టుకోండి" అంటూనే రివాల్వరు పెద్దపులికేసి గురిచూడసాగాడు.

అది చెట్టుమొదట్లో నిలబడున్న ఆనంద్ ను, సింగామియాను చూడగానే, ఆశగా, ఆత్రంగా నోరు తెరిచింది.

రివాల్వరు పేల్చాడు. గుండు నోట్లోకి దూరింది. దాని దెబ్బకు పులి తిరగబడింది. తన్నుకోసాగింది. రెండునిముషాలు పొర్లి కింతలు పెట్టింది. ఆ తర్వాత మెల్లగా లేచింది. కానీ దానికాళ్ళు స్వాధీనంలో లేవు. నడవలేకుండావుంది. ఆనంద్ కి దగ్గరగా రావాలన్ని, భూమ్మీద ప్రాకసాగింది.

"వండర్ ఫుల్ షాట్!" అన్నాడు సింగామియా.

"దానికి ఛస్తుందో లేదో!" అనుమానంగా చూశాడు.

"ఛస్తుంది. మరోమారు పేల్చు. చాలా పవర్ ఫుల్ గుండ్లవి" అన్నాడు సింగామియా.

"వద్దు! మనకు ముందుముందు అవసరంగావచ్చు. అనవసరంగా వేస్టు చేసినందువల్ల తర్వాత మనమే ఇబ్బందుల్లో పడతాం!" అన్నాడు ఆనంద్.

ఒకగజం ముందుకుప్రాకి, ఆ తర్వాత దానివల్లకాక తల, వాల్చేసింది పెద్దపులి.

"చచ్చింది!" చెట్టుపైనుండి అరిచాడు సుందర్.

"ఇంక దిగిరా!" అన్నాడు ఆనంద్.

అతని మాటలు పూర్తయ్యేలోపలే క్రిందకు దిగింది రోజా. ఆనంద్ ను ఆనందంతో కౌగలించుకుంది. సింగామియాకూడా అతనితో కరచాలనంచేసి "ఇంత ధైర్యం సమయస్ఫూర్తివున్న మనిషివి దొంగవెందుకయినావు" అడిగాడు.

"ఖర్మసార్! ఖర్మ! మరేం లేదు!" అన్నాడు ఆనంద్.

పెద్దపులిదగ్గరకంటూ వెళ్ళి నిలుచుని చూశారు. జూలో ఇనుపబోనులో వున్నప్పుడు చూడటానికీ, ఇలా అడవిలో చూడటానికీ ఎంతో భేదం కనుపించింది.

"ఎవరి దగ్గరన్నా బాకుందా?" అడిగాడు ఆనంద్.

"ఎందుకు?"

"పులిగోళ్లు కోస్తాను. రోజాకు దండ చేయించవచ్చు" అన్నాడు ఆనంద్.

సింగామియా తన కీరింగు ఇచ్చాడు. అందులో చిన్న నైఫ్ వుంది. దాని సాయంతో ఆనంద్ పులిగోళ్లుకోసి జేబులో వేసుకున్నాడు.

9

అక్కణ్ణుంచి ముందుకు కదిలారు. గంటమూడయింది. ప్రొద్దుగూకేందుకు మరో మూడుగంటల టయిముంది. ఆలోగా తాము లోయ పైభాగాన్నుండి చూసిన గూడెం చేరుకోవాలన్న తాపత్రయం ప్రతిఒక్కరిలోనూ వుంది. మాట్లాడకుండా నడవసాగారు. చెట్లను పాముకుబుసాలు వ్రేలాడుతున్నాయి. దూరంగా అక్కడక్కడా ఎండుటాకులమీద ఏదో జంతువులు నడుస్తున్నట్లు శబ్దం వినిపించసాగింది. ఆశబ్దం వచ్చినప్పుడల్లా అందరూ ఆగి చుట్టూ చూడసాగారు. అందరికన్నా ముందు ఆనంద్ నడవసాగాడు.

రోజా భుజంపైన చెయ్యివేసుకుని కాస్త తేలికగానే నడవడం నేర్చుకున్నాడు సింగామియా. కాలి నొప్పి మాత్రం తగ్గలేదు.

మరో రెండుగంటలు నడిచారు.

ఉన్నట్టుండి పెద్దకోతుల గుంపొకటివచ్చి వాళ్ళపైన

పడింది. రోజా చేతుల్లోవున్న హాండ్ కేస్ లాక్కు పోయాయి. చెట్టెక్కి కూర్చుని దాన్ని తెరచాయి. దాంట్లోవున్న బ్రాందీబాటిల్సు క్రిందపడి పగిలిపోయాయి. నోట్లు గాలికి గాలిపటాల్లా ఎగరడం మొదలెట్టాయి.

“డబ్బు! డబ్బు! ఎగిరిపోతూంది!” అందినన్ని నోట్లు దొరకబుచ్చుకుందామని పరుగెత్తాడు సుందర్. పైన చూస్తూ పరుగెత్తడంలో క్రిందెక్కడో పాముపైన కాలు వేశాడు. అది కాస్తా కాటు వేసింది. దాంతో అమ్మో అంటూ అరచాడు. ఆ అరుపు వినగానే పరుగెత్తాడు ఆనంద్ అటువేపు. రెండు చేతుల్తో కాలుపట్టుకొని “పెద్ద పాము అటేపోయింది. నన్ను కరచింది. ప్రాణం పోతోంది” పెద్దగా ఏడ్చాడు.

ఆనంద్ అటు చూపించినవేపు చూచాడు. ఏమీ కనుపించలేదు.

“ఆనంద్! నన్ను బ్రతికించు” అన్నాడు దీనంగా సుందర్.

ఆనంద్ వంగి అతని కాలికేసి చూశాడు. కాటేసిన చోట చుట్టూ చెమటపట్టింది. అంతలో రోజా కూడా పరుగెత్తుకొచ్చింది.

“ఏమైంది?” అడిగింది.

“పాముకరిచింది!” అన్నాడు ఆనంద్.

“బాగా అయింది. ఛావనీ, దుర్మార్గుణ్ణి” అంది రోజా కోపంగా.

“తప్పు. నీ జాకెట్ విప్పు” అన్నాడు.

“ఎందుకు?”

“తర్వాత చెప్తాను. ముందువిప్పు” అన్నాడు.

మాట్లాడకుండా విప్పి అందించింది. ఆనంద్ అందు

కుని దాన్ని మెలిదిప్పి త్రాడులా చేశాడు. పాముకరచిన చోటికి పైవేపు కాలికి బాగా బిగించికట్టాడు. జేబులోంచి సింగామియా దగ్గర తీసుకొన్న తాళాలగుత్తి వెతికిలాగాడు, దాంట్లోంచి పెన్‌నైఫ్ తీసి బ్లేడ్ లాగాడు. సుందర్‌ను కళ్ళుమూసుకోమన్నాడు.

"ఏంచేస్తావ్?" అడిగింది రోజా.

"చూస్తూండు" అన్నాడు ఆనంద్.

మెల్లగా కత్తిమొనను పాము కాటేసినచోట బలంగా పొడిచి రౌండ్‌గా త్రిప్పాడు. ఆ నొప్పికి తట్టుకోలేక సుందర్ "అమ్మో! బాబూ!" అంటూ అరుపులు పెట్టాడు. ఆనంద్ కత్తి వెలుపలకు లాగేశాడు. రక్తం వెలుపలికి చిమ్ముకొచ్చింది. రెండునిముషాలు అలా రానిచ్చాడు ఆనంద్. ఆ తర్వాత రెండు చేతుల్తో కాలిని గట్టిగా పట్టుకుని తన బలమంతా ఉపయోగించి పిండినట్లు చేశాడు. ఇంకొంత రక్తం వచ్చింది.

"పాడుడబ్బు! కన్నుమిన్ను చూడకుండా దానికోసం పరుగెత్తడమెందుకు? ప్రాణాలకిలా అపాయం తెచ్చుకోవడమెందుకు?" అన్నాడు సింగామియా వచ్చి, చూసి జరిగినఘోరం అర్థంచేసుకుని.

"డబ్బుకోసం ఏమైనా చేసేరకం. ఆనంద్ అనవసరంగా అతన్నిగురించి తంటాలుపడుతున్నాడు. తన ప్లాను సవ్యంగా జరిగితే వాళ్ళిద్దర్నీ మోసం చెయ్యాలని ప్లాను వేశాడు. దేవుడు మొత్తానికే ఎసరు పెట్టాడు!" అంది రోజా.

10

పదినిముషాల తర్వాత సుందర్ కళ్ళు తెరచాడు.

"ఎలావుంది?" అడిగాడు ఆనంద్.

"నీరసంగా వుంది."

"నొప్పి పైకెక్కుతున్నట్లుందా? లేక పట్టినచోటనే వుందా?"

"ఎక్కడాలేదు" అన్నాడు సుందర్.

"అయితే! లేచిరాపోదాం!" అన్నాడు ఆనంద్.

"నేను నడవలేను. నన్ను సాయంపట్టి నువ్వే తీసుకు పోవాలి!" అన్నాడు సుందర్.

సరేనంటూ ఆనంద్ సుందర్‌ను లేవదీసి అతని చేతిని తన మెడచుట్టూ వేసుకుని తనునడుస్తూ అతన్ని నడిపిస్తూ ముందుకు సాగాడు. ఎప్పటిలాగే సింగామియాకూడా రోజా భుజంపైన తలపెట్టుకుని బరువంతా ఆమెకేస్తూ నడవసాగాడు.

"మన పథకం పతనమైపోయింది చూశావా?" అన్నాడు సుందర్.

"దానిసంగతి మరచిపో! ముందు ప్రాణాలతో ఈ అడవిలోంచి బయటపడితే చాలనిపిస్తోంది నాకు!" అన్నాడు ఆనంద్.

"నా కలాగనిపించడంలేదు. మమ్మల్ని రెండు పెద్ద ప్రమాదాల్లోంచి తప్పించావ్. నీ సాయంతో మనం ఖచ్చితంగా ప్రాణాలతో బయటపడతాం. సింగామియా కూడా బైటపడతాడు. ఇప్పుడిలా మనతో తిరిగిన మనిషి నాగరిక ప్రపంచంలో అడుగుబెట్టగానే మామూలుస్థితికి వచ్చేస్తాడు. కానీ మనం క్రిమినల్స్‌లా మిగిలిపోతాం. అడవిదాటాక అతను మనల్ని వేటాడుతాడు. అక్కడ మనల్ని మనం రక్షించుకునేందుకు, నీ ఉపాయాలు, సమయస్ఫూర్తీ దేనికి పనికిరావు. ఏ డబ్బుకు ఇక్కడ విలువలేదో,అదబ్బే అక్కడ మనల్ని అణచిపెడుతుంది."

"అయితే ఏంచేద్దామంటావ్."

"సింగామియాతో బేరం పెడదాం! ప్రాణాలతో బయటపడాలంటే అతని ఆస్తిలో సగం రానిమ్మని అడుగుదాం. అందుకు ఒప్పుకోకపోతే అతన్నివదిలేద్దాం. రోజా ఆడది. దానివల్ల ఏమీకాదు. ఇద్దరూ ఛస్తారు ఇక్కడే!" అన్నాడు సుందర్.

"అందువల్ల మనకు వచ్చేదేమిటి?"

"మనల్ని గురించి తెలిసిన మనుషులిద్దరుండరు. మరో పథకమేదన్నా వేద్దాం. డబ్బు సంపాదించుకుందాం" అన్నాడు సుందర్, ఆనంద్ తనదోవకు వస్తున్నందుకు సంతోషపడుతూ,

ఆనంద్ ఆలోచించాడు. సుందర్‌తో వాదించి లాభం లేదనిపించింది. మృత్యుముఖంనుండి బయటపడగానే అతని మెదడు మళ్ళీ మామూలుదారిలోనే నడుస్తూంది. సింగామియా మంచితనం, అతన్ని ఎందుకో ఆకర్షించింది. అతన్నెలాగైనా ఏ ఆపదాలేకుండా ఈ అడవిలోంచి బయటపడెయ్యాలనిపించింది. అది పైకి చెప్పకుండా సుందర్‌తో "సరే! మాట్లాడుతాను. ఏమంటాడో చూద్దాం!" అన్నాడు.

"నువ్వొద్దు! నన్ను మాట్లాడనీ. ఇలాటి వ్యవహారాల్లో ఎలామాట్లాడాలో నీకు అర్థంకాదు" అన్నాడు సుందర్.

"సరే! నువ్వు మాట్లాడు. కానీ ఒక్క విషయం మరచిపోవద్దు. నీగురించి తెలుసుకోవలసిందంతా రోజాద్వారా తెలుసుకున్నాను. నన్ను మోసంచేద్దామని ప్రయత్నించావా, నీకింతకుముందు పోసిన ప్రాణాల్ని నిర్దాక్షిణ్యంగా తోడేస్తాను. జాగ్రత్త!" అన్నాడు.

"ఛ! అలా ఎప్పటికీ చెయ్యను. మనిద్దరం ఒకటే!" అన్నాడు సుందర్.

మాటల్లో వీళ్ళిద్దరూ వెనుకపడిపోయారు. రోజా సింగామియా బాగా ముందుకు వెళ్ళారు. చెట్లు అంత దట్టంగా లేకపోవడంతో దూరంగా వాళ్ళు కనుపించ సాగారు.

"అయ్యో! అయ్యో!" పెద్దగా రోజా కేకలు పెట్టడం విని, సుందర్‌ని భుజంపైనుండి క్రిందకు దించి అటు కేసి పరుగెత్తాడు.

"ఏమయింది?" అడిగాడు ఆనంద్.

"యూరిన్ కెళ్ళొస్తానని అటు వెళ్ళాడు. అక్కడేదో మాటు పెట్టినట్లున్నారు. లోపలకు కూలిపోయాడు" అంది రోజా.

సుందర్ పాక్కుంటూ వచ్చాడు, ఆనంద్ రోజాల వద్దకు.

ఆనంద్ వెళ్ళి చూశాడు. ఏదో మృగాన్ని పట్టుకునేందుకు పెట్టిన మాటులో చిక్కుపోయాడు సింగామియా. వొంగి కూర్చుని లోనికి చూశాడు. నలభై అడుగుల పైనే వుంది అగడ్త. అందులో బోర్లాపడివున్నాడు సింగామియా.

పెద్దగా పిలిచాడు. అతను పలకలేదు. కదులుతాడేమోనని గుడ్లప్పగించిచూశాడు. కానీ అతనిలో చలనం లేదు.

"అంతలోతున పడివున్నాడు. ప్రాణాలున్నాయో, లేవో!" అంది రోజా.

"అదే నేనూ చూస్తున్నాను. కదలికలేకుండా పడివున్నాడు!" అన్నాడు ఆనంద్.

"మన పనికాకుండానే చచ్చినట్లున్నాడు రోగ్!" అన్నాడు సుందర్.

అతనిమాట వినగానే అగ్గిపుల్లలాంటి కళ్లు చిట్లించి చూడ సాగాడు ఆనంద్. సింగామియా శరీరం కొద్దిగా కదలినట్లు గమనించాడు.

"ప్రాణంపోలేదు రోజా! అతను బ్రతికే వున్నాడు. కదులుతున్నాడు" చెప్పాడు ఆనందంగా.

రోజాకూడా వంగి చూసింది. బ్రాసరీ, పెట్టీ కోట్ తప్ప ఆమె వొంటిపైన మరే బట్టా లేదు. అయినా ఆమెకు తను స్త్రీననే విషయంగానీ, ఇద్దరు మగవాళ్ళ మధ్య వున్నానన్న విషయంగానీ, గుర్తులేవు.

"బ్రతికించాడు!" అన్నాడు సుందర్.

అతనికేసి అసహ్యంగా చూసింది రోజా.

"మీరు ఇక్కడే వుండండి. నేను వెళ్ళి ఏదైనా తాడు లాంటి తీగలుగానీ, మర్రిచెట్టు ఊడలుగానీ దొరుకుతా యేమో చూస్తాను" అన్నాడు ఆనంద్.

"అలాగే!" రోజా అంది అతను ఖాళీచేసిన స్థలంలో కూర్చుంటూ.

"ఆనంద్!" పిలిచాడు సుందర్.

ముందుకు వెళ్ళబోతున్న మనిషి ఆగి వెనక్కి తిరిగి ఏమిటన్నట్లు చూశాడు.

"ఇంతకన్నా మంచి అవకాశం రాదు మనకి. ఇప్పుడే పెట్టు బేరం. సగం ఆస్తి ఇస్తేనే వెలుపలకు లాగుతానని చెప్పు. లేకుంటే అక్కడే వదలివేసిపోతానని బెదిరించు. చచ్చినట్లు ఒప్పుకుంటాడు" అన్నాడు సుందర్.

"సరేలే! ముందు అతన్ని రక్షించే మార్గం చూడనీ!" అంటూ కదలి ముందుకు వెళ్ళాడు ఆనంద్.

"మళ్ళా ఏదో అతనికి నూరిపోసినట్లున్నావ్!" అనుమానంగా చూస్తూ అడిగింది రోజా.

"నీ కనవసరం! డబ్బువు వాళ్ళేకాదు సర్వస్వం అమ్ముకునే రంకు ముండవు. నిన్ను నమ్మటం నాదే తప్పయింది. ఇలా వాడివెంటపడి నమ్మల్ని మోసం చేస్తావనుకోలేదు!" అన్నాడు సుందర్ కోపంగా.

"నువ్వేదో పెద్ద తెలివిగలవాడవని అనుకున్నానే! అది నాదే తప్పు. నీ అంత నీచుణ్ని నేను ఎప్పుడూ చూడలేదు. నీతో కొన్నిదినాలు గడిపానన్న విషయం గుర్తొస్తే నా శరీరంపైన నాకే అసహ్యంగా వుంది!" అంది రోజా.

"ఉంటుంది. ఆ బంగారు పిచిక చేతికి చిక్కిందిగా. ఈ అడవిలోంచి బైటపడ్డాక వాడి అసలు రంగు తెలుస్తుంది. అప్పుడు మళ్ళా నే నేగతి నీకు!" అన్నాడు సుందర్.

"అటువంటి గతిపడితే నీ దగ్గరకు మాత్రం రాను. ఉరిపోసుకుని చస్తాను."

"అంతదాకా ఎందుకు! అదేదో ఇప్పుడే చావు!" అంటూ ఆదమరచివున్న తరుణంలో నెట్టాడు వెనక్కి సుందర్. రోజా పెద్దగా అరుస్తూ అగడ్తలోపడిపోయింది.

'పీడ వదలింది!' అనుకున్నాడు.

అరగంటయినా ఆనంద్ రాలేదు. వెలుతురును చీకటి నంజుకొని తినసాగింది. చిక్కంగా చుట్టూ పేరుకుంది. హోరుమని వీస్తున్న గాలికి తలలూపుతున్న పెద్దపెద్ద టేకు చెట్లు దయ్యాల్లా వున్నాయి. ఆనంద్ త్వరగావస్తే బాగుండుననుకున్నాడు. మరో అరగంట గడిచింది.

ఆనంద్ కేదన్నా ప్రమాదం జరిగిందేమోనన్న భయం వేసింది.

అగడ్తలోకి వంగిచూశాడు. రోజా, సింగామియా

ఇద్దరూ కూర్చునివున్నారు. వాళ్ళు చావనందుకు కోపంగా వుంది సుందర్ కు.

అంతలో ఆనంద్ వచ్చాడు. అతని నెత్తిన లావుపాటి తీగల మోపువుంది. దాన్ని క్రిందపత్రోసి "రోజా ఏదీ!" అడిగాడు సుందర్ ను.

"ఆమెకూడా ప్రియుడి దగ్గరకు వెళ్ళింది" అంటూ అగడ్త వేపు చూపించాడు.

ఆనంద్ తొంగిచూశాడు. రోజా కనుపించింది. ఆనంద్ ను చూడగానే చెయ్యి ఊపింది. చీకట్లో తను ఏంచేసేందుకు వీలుపడదని అర్ధంచేసుకుని తెల్లారిందాకా సర్దుకొని అక్కడే ధైర్యంగా వుండమని చెప్పాడు.

"సరే!" నని పెద్దగా అరచింది రోజా.

తెచ్చిన మోపువిప్పి, తీగల్ని సరిచేస్తూ కూర్చున్నాడు. సుందర్ కూడా అయిష్టంగానే అతనికి సాయం చెయ్య సాగాడు ఆ పనిలో.

"రోజాను నువ్వు తోసేశావా?" అడిగాడు ఆనంద్.

"లేదు! ఆమే దూకింది."

"అబద్ధాలు చెప్పకు. నువ్వింత నీచాతినీచంగా ఎందుకు ప్రవర్తిస్తున్నావో నాకు అర్ధంగావటంలేదు. ఎదుటివాళ్ళు సుఖపడ్డా చూచి ఓర్చుకోలేని తత్వం లాగుంది నీది. నీకు ప్రాణాలు పోయడం ఒక్కటే నేను జీవితంలో చేసిన పెద్ద నేరమనిపిస్తుంది" తీగలకు ముళ్ళు వేస్తూ అన్నాడు ఆనంద్.

"నన్నన్యాయంగా నిందిస్తున్నావ్. నాకేం తెలీదు. రోజా నిజంగానే కాలుజారి పడిపోయింది" అన్నాడు సుందర్.

అతనితో మాట్లాడేందుకూడా మనసొప్పలేదు

ఆనంద్ కు. తనపనిలో నిమగ్నమయిపోయాడు.

నాలుగైదు గంటలు ఓపిగ్గా శ్రమపడ్డాక అరవై అడుగులపొడవున్న తాడులాంటిదాన్ని తీగలతో తయారు చేశాడు. దాని ఒకచివర్ని ఒక పెద్ద చెట్టు మొదలుకు బాగా బిగించికట్టాడు. బలంగా గుంజిలాగాడు. ముడి బిగుసుకుంది. రెండోచివర్ని తెచ్చి అగడ్తలోకి దించాడు. దాని కొసవెళ్ళి సింగామియాను తాకింది.

అగడ్తపైన నిలబడి అరచి చెప్పాడు దాన్ని పట్టుకుని మెల్లగా పైకిరమ్మని.

సింగామియా ప్రయత్నించాడు. రోజాకూడా సాయం చేసింది. పట్టుమని పదడుగులు ఎక్కకముందే జర్రున క్రిందికి జారిపోసాగాడు. వొళ్ళంతా పుండులా వుండటం, దానికితోడు రెండుదినాలుగా తిండిలేకపోవడం అతన్ని నిర్వీర్యుణ్ణిచేశాయి.

ఆనంద్ ఎదురుచూసిచూసి లాభంలేదని నిర్ణయించుకుని రోజాను ట్రైచెయ్యమన్నాడు. అరగంట అవస్థపడి రోజా మెల్లగా పైకొచ్చింది.

"అంత అజాగ్రత్తగా ఎందుకున్నావ్?" అడిగాడు ఆనంద్.

సుందర్ ఏంచెప్పివుంటాడో ఆమెకు అర్థమయింది. జరిగిన నిజం చెప్పటంకన్నా, అతని సాయంతో మెల్లగా సింగామియాను పైకి లాక్కురావడం అవసరమన్న భావం కలిగింది.

"అయిందేదో అయింది. అతన్నెలా పైకిలేవడం. బాగా నీరసించిపోయాడు. పదిసార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది" అంది రోజా.

"ఫరవాలేదు. అతన్ని ఘట్టిగా పట్టుకోమందాం.

మనం ముగ్గురం తీగల్ని పట్టుకుని పైకిలాగుదాం. వచ్చేస్తాడు పైకి" అన్నాడు ఆనంద్.

అతని ఆలోచన రోజాకు నచ్చింది.

"ఆ పర్వతాన్ని మనం లాగగలమా! తిండితిని రెండ్రోజులయింది!" అన్నాడు సుందర్.

"నోరుమూసుకుని చెప్పింది చెయ్యి" అన్నాడు కోపంగా.

సుందర్ మౌనంగా వుండిపోయాడు.

ఆనంద్ అగడ్డలోకి తొంగిచూసి నోటిచుట్టూ రెండు చేతులూ అడ్డంపెట్టి తను ఆలోచించిన పథకం సింగామియాకు పెద్దగా వివరంగా చెప్పాడు.

సింగామియా తీగల్ని వొంటికి కట్టుకుని ముడివేసుకున్నాడు. రెండుచేతుల్తో పైభాగం పట్టుకొన్నాడు. పైన ఆనంద్, సుందర్, రోజా ముగ్గురూ బలంగా దాన్ని లాగడం మొదలెట్టారు. వాళ్ళ ముగ్గురి శక్తంతా ఉపయోగిస్తే సింగామియాని పైకిలాగేందుకు అరగంట పట్టింది.

అందరూ పైనచేరారు.

ఆ ప్రమాదంలోంచి ప్రాణాలు పోకుండా తప్పికున్నందుకు సంతోషంగావుంది సింగామియాకు,ఆనంద్ కు.

11

"ఇక్కడ మాటుపెట్టారంటే చుట్టుప్రక్కల మనుషులెవరో వున్నట్లే. తాము పెట్టిన మాటులో ఏదైనా మృగం పడిందేమో చూసేందుకు రోజూ వస్తారు. తెల్లారిందాకా మనం ఇక్కడేవుందాం. వాళ్లెవరన్నావస్తే, వాళ్ళసాయంతో దారి తెలుసుకోవచ్చు!" అన్నాడు ఆనంద్.

మనుషుల పేరు వినగానే రోజాకు ఆనందం వేసింది.

సింగామియాకూడా ఆనంద్ ఆలోచనను సమర్థించాడు. అందరూ అగడ్త ప్రక్కనేవున్న చెట్టు మొదట్లో చేరబడ్డారు.

"నిద్ర వస్తోంది!" అంది రోజా.

"పడుకొని విశ్రాంతి తీసుకో!" అన్నాడు ఆనంద్.

"ఈలోగా ఏ అడవిదయ్యమో వచ్చి మనల్ని బిర్యానీలా నంజుకుని తింటుంది. ఆమె ఒక్కతేం ఖర్మ! అందరం నిద్రపోదాం!" అన్నాడు సుందర్.

"దయ్యాలూ గియ్యాలూ ఏవీ లేవు. మీరు పడుకోండి. నాకు నిద్ర రావడం లేదు. నేను మేలుకొనే వుంటాను" అన్నాడు ఆనంద్.

"నాకు నిద్ర రావడం లేదు!" అన్నాడు సింగామియా.

అందరూ అలాగే కూర్చున్నారు. నిద్రవస్తున్నా భయానికి ఆపుకున్నారు. తెల్లవారుబోతున్నట్లు సన్నగా వెలుగు కనిపించింది. ఆ వెలుగులోనే గుర్రాల డెక్కల శబ్దం కూడా వినిపించింది.

"ఎవరో వస్తున్నట్లున్నారు. అలా చెట్ల వెనక్కి నక్కుదాం" అన్నాడు ఆనంద్ ముందు దారితీస్తూ.

అందరూ అతన్ని అనుసరించారు.

అంతలోనే నాలుగు గుర్రాలొచ్చి అగడ్త దగ్గర ఆగాయి. వాటిపైనున్న బుర్రమీసాలవాళ్ళు దిగారు. మెల్లగా నడచుకొంటూ అగడ్తదగ్గరకొచ్చి చూశారు.

"మన మాటు చెదరింది. ఏదో మెఖం పడినట్లుంది!" అన్నాడొకడు హిందీలో.

మిగిలిన ముగ్గురూ వెళ్ళి తొంగి చూశారు.

"లోపల లేదీ లేదే!" అంటూ ఆలోచిస్తూ నిలుచున్నారు.

చెట్టుకు కట్టివున్న తీగలకుప్ప కనుపించింది.

"అరేయ్! ఈ ప్రాంతంలో ఎవరో మనుషులు తచ్చాడుతున్నారు. అది చూశావా?" అంటూ చూపించాడు ఒకడు చెట్టుకు మిగిలిన ముగ్గురికీ.

అందరి దగ్గర పెద్ద రైఫిల్స్ వున్నాయి. నడుంచుట్టు వున్న తోలుపటకా నిండా గుండ్లువున్నాయి.

వాళ్ళను చూడగానే చంబల్ వాలీ డెకాయిట్సని సులభంగానే గుర్తుపట్టాడు సింగామియా. అంతకుముందు పులిని చూచినా ఆనంద్ కు, మిగిలిన వాళ్ళకు భయంపుట్ట లేదు. కానీ ఆ ఆగంతకుల్ని చూడగానే భయంపుట్టింది. పచ్చినెత్తురు త్రాగే కసాయివాళ్ళలాగున్నాయి ఆకతాయి రూలు.

"తప్పించుకుందామా?" అడిగాడు ఆనంద్ రహస్యంగా.

"వద్దు! వాళ్ళకు తెలీనిదేదీ వుండదీ అడవిలో. ఎంతోసేపు వాళ్ళ కళ్ళుగట్టి తిరగలేం!" అన్నాడు సింగామియా.

"అయితే లొంగిపోదామా?"

"ఆఁ!"

"మన ప్రాణాలకు ముప్పు తెస్తారేమో?"

"ఏం ఫరవాలేదు. వాళ్ళను నాకు వదిలెయ్. నేను చూసుకుంటాను" అన్నాడు సింగామియా.

సుందర్ వాళ్ళను చూడగానే భయపడిపోయాడు. సింగామియా వాళ్ళముందుకుపోదామనగానే పైప్రాణాలు పైనేపోయాయి. వాళ్ళ చేతుల్లో చావడం ఇష్టంలేకపోయింది. బ్రతికున్నంతసేపు, చావును దూరంగా వుంచాలన్నదే అతని పద్ధతి. అందుకే మిగిలినవాళ్ళ గతే

పైనా తనకు అవసరం లేదనుకుని, అక్కడ్నుంచి చెట్ల లోకి వెళ్ళిపోయాడు.

అంతలోనే బందిపోటుదొంగలు మిగిలిన ముగ్గుర్నీ చుట్టుముట్టేశారు. తుపాకీలు బారుచేశారు. ముగ్గురూ చేతులెత్తారు.

"ఎవరు మీరు?"

"దారితప్పిన విమాన ప్రయాణీకులం. మేముప్రయాణం చేస్తున్న విమానం కూలిపోయింది. అందరూ చని పోయారు. మేముమాత్రం మిగిలాం. రెండుదినాలనుండి అడవిలో దారీ తెన్నూ తెలీకుండా తిరుగుతున్నాం. రాత్రి ఈ మాటులో ఇతను పడిపోయాడు. అతన్ని రక్షించుకొనే ప్రయత్నంలో రాత్రంతా ఇక్కడే గడిపాం!" అన్నాడు ఆనంద్.

"మీరు పోలీసుల్లాగున్నారే!"

"కాదు! నా పేరు ఆనంద్. మద్రాసులో జేబుదొంగ తనాలు చేస్తూ బ్రతుకుతుంటాను. ఆమె పేరు రోజా. క్లబ్బులో డాన్సు చేస్తూంటుంది. ఇక ఇతని పేరు సింగా మియా. కలకత్తాలో పెద్దవ్యాపారి. విమానంకూడా వారిదే. దాంట్లోనే ప్రయాణంచేస్తూ ఈ స్థితికివచ్చాం" అన్నాడు ఆనంద్ మళ్ళీ.

"ఈ మాటు జంతువులకాక్కాదు పెట్టింది. పోలీసుల జీపులకు, వాళ్ళ జవాన్లకు" అన్నాడు ఒకతను.

"మేము పోలీసులంకాదు!"

"మీరు చెప్పేది నిజమని మేమెలా నమ్మాలి."

"మాకు తగిలిన ఈ దెబ్బలు, వొంటినిండా మిగిలిన గాయాలు చూడండి."

"మేము పోలీసులమైతే ఈ స్థితి కొందుకొస్తాం!"

అన్నాడు ఆనంద్.

“అంతవరకు అవసరంలేదు. నాకంపెనీ అడ్రసు ఇస్తాను. మీరువెళ్ళి నన్ను బందీగా పట్టుకున్నామని రెండులక్షలిస్తే వదుల్తామని మా మేనేజరుకు ఫోన్‌లో చెప్పండి. మీకా డబ్బు వస్తుంది. అదివచ్చాక మమ్మల్ని వదలండి” అన్నాడు సింగామియా.

లక్షలు అన్న అక్షరాలపైన అతను నొక్కిన నొక్కుడుకు, వాళ్ళ తలలు దిమ్మతిరిగిపోయాయి.

“అయితే నడవండి” అన్నారు వాళ్లు.

ముగ్గురి చేతులుకలిపి సన్నటి పగ్గంలాంటి తాడుతో కట్టేశారు. ఆ తాడు గుర్రపు జీనుకు కట్టుకొన్నాడు ఒకతను. అతని గుర్రంముందు దాని వెనుక బాధితులు, వాళ్ళవెనుక మిగిలిన ముగ్గురు బందిపోట్లు గుర్రాలపైన.

చెట్లచాటునుండి, అలా గంట నడకతో చిన్న పల్లె లాంటి గూడెం చేరారు.

చాలామంది ఆడవాళ్ళు, పిల్లలు గుంపుగా వచ్చారు చూచేందుకు.

12

సింగామియానూ, ఆనంద్‌ను, రోజాను, తీసుకెళ్ళి ఒక పెద్ద గుహలాంటి దాంట్లో పెట్టి వెలుపల తలుపులుమూసి తాళం పెట్టారు.

“మాకు బాగా ఆకలిగా వుంది. తినేందుకేమయినా పెట్టండి!” అడిగాడు సింగామియా హిందీలో.

ఒకతను అరగంటలో తిరిగొచ్చి కమ్మటి కోడికూరా, ఒక పెద్ద చపాతీల దొంతర, మంచినీళ్ళు అందించి పోయాడు.

ఆ తర్వాత అరగంటకు ఇంకొకతను వచ్చి “సిగరెట్లు

కావాలా?" అడిగాడు.

"కావాలి!" అన్నాడు సింగామియా.

గోల్డ్ ఫ్లాక్ పాకెట్, అగ్గిపెట్టె విసరేశాడు.

"మీ నాయకుడెవరు?"

"ఠాకూర్ షేర్ హేమ్‌సింగ్!" అన్నాడు వాడు మీసం మెలిత్రిప్పుతూ. అతను వెళ్ళిపోయాడు.

సింగామియా సిగరెట్ త్రాగుతూ మౌనంగా కూర్చున్నాడు.

"ఏమిటలా వున్నారు?" అడిగింది రోజా.

"ఆ హేమ్‌సింగ్ గురించి విన్నావా? అతను నెత్తురు త్రాగుతాడు. చంబల్ వాలీలోకల్లా బలవంతుడైన బందిపోటు అతనే. ఒకవిధంగా వీళ్ళకంతా చక్రవర్తిలాంటివాడు. తనమాట విననివాళ్ళని నిలువునా నరుకుతాడు. అతను చేసిన హత్యలకు లెఖ్ఖలేదు. నాలుగైదుసార్లు పోలీసులతో తలబడి తనే గెలిచాడు. ఈ మధ్యనే, అంటే వారం దినాలక్రితం, తను ఖచ్చితంగా లొంగిపోదలచుకున్నానని ప్రభుత్వానికి వర్తమానం పంపేడు. ఆ రోజు నేను భోపాల్‌లో వున్నాను. గవర్నమెంటుకు చాలా ఆనందంగావుంది. అతనిపైనున్న కేసుల్ని కొట్టివేస్తానంది" అన్నాడు సింగామియా.

"నాకు తెలిసి లొంగలేదు" అన్నాడు ఆనంద్.

అంతలో వెలుపల జనంలో కలకలం బయలుదేరింది. ఇద్దరు బందిపోటుదొంగలు ఒకశవాన్ని గుర్రానికి కట్టి లాక్కొచ్చారు. దాన్ని తెచ్చి సింగామియాకు చూపించి "ఇతన్ని మీరు చూశారా?" అడిగారు.

ఎవ్వరికీ నోటమాటరాలేదు. అది సుందర్ శవం. ప్రాణాలు కాపాడుకునేందుకు అడవిలోకి వెళ్ళినందుకు

అతనికి పట్టిన దుర్గతికి ముగ్గురికీ బాధకలిగింది.

"తెలుసు! మా స్నేహితుడే! విమానం కూలిపోయాక కనుపించలేదు. చచ్చిపోయాడనుకున్నాం. మీ కెక్కడ దొరికింది శవం?" అడిగాడు సింగామియా.

"శవంకాదు! మనిషే దొరికాడు!" అన్నాడు దొంగ.

"చంపేశారెందుకు?"

"పరుగెత్తాడు, కాల్చాను. చచ్చాడు" అన్నాడు నిర్లిప్తంగా.

మరోగంటకు హేమసింగ్ కార్లో వచ్చాడు. అతని వెనుక కొన్ని పోలీసువాన్లు వచ్చాయి. కార్లో అతనివెంట ఇద్దరు ఖద్దరుచొక్కావాలాలు, మరో ఇద్దరు పోలీసు ఆఫీసర్లు దిగారు. తన అనుచరుల కందరికీ తను లొంగిపోయినట్లు ప్రకటించి అందర్నీ ఆయుధాలు తెచ్చి ఇచ్చేసి లొంగిపొమ్మన్నాడు. పెద్ద గుట్టలా పడ్డాయి తుపాకీలు. ఎవరో బంధితుల గురించి చెప్పగానే వది లెయ్యమన్నారు. తలుపులు తెరవబడ్డాయి.

సింగామియా పోలీసు ఆఫీసర్లను కలుసుకుని జరిగిన గొడవ మొత్తం చెప్పగానే, ఆ విమానం గురించి తమ ప్రభుత్వంకూడా వెతుకుతూందనీ ప్రాణాలతో కొంత మందన్నా బైట పడ్డందుకు సంతోషంగా వుందనీ చెప్పాడు.

వాళ్ళతోటే భూపాల్ చేరారు. అక్కడ్నుంచి కల కత్తావ విమానం ఎక్కుతుంటే "నేను రాను!" అంది రోజా.

"ఏం? మనను మార్చుకున్నావా?" అడిగాడు సింగామియా.

"లేదు! ట్రయిన్లో పోదాం!" అంది భయంగా.

"ఫరవాలేదు! ప్రమాదాలు రోజూ రావు. ఆనంద్ వెళ్లి మూడు టిక్కెట్లు పట్రా!" అన్నాడు సింగామియా.

"నే నెందుకు సార్ మీతో!" ఆనంద్ అన్నాడు సింగామియాతో.

"నా ప్రాణాల్ని కాపాడినందుకు! నిన్ను నా ప్రైవేట్ సెక్రటరీగా తీసుకుంటున్నాను" అన్నాడు సింగామియా.

"నేను దొంగను" అన్నాడు ఆనంద్.

"కాని దెవ్వరు? నరరూప రాక్షసుడైన థాపా హేమ్ సింగ్‌ను మన్నించగల ప్రభుత్వం మనది. నిన్ను నేను మన్నిస్తున్నాను. వెళ్ళి టిక్కెట్లు తీసుకురా!" అన్నాడు.

అరగంట తర్వాత విమానం ఆకాశంలోకి లేచింది.

"నీకు విమానం కావాలా?" అడిగాడు సింగామియా, రోజాను ప్రేమగా చూస్తూ.

"వద్దు! మీ పాదాల చెంత నే బ్రతక నివ్వండి చాలు!" అంది రోజా.

సింగామియా హృదయం ఆనందంతో పొంగిపోయింది.

—: ఐ పో యిం ది :—